
జగన్ రాక సందర్భంగా పీఎం పాలెం వద్ద ట్రాఫిక్‌జామ్

జగన్ రోడ్‌షో వెలవెల

- బస్సు యాత్రకు కనిపించని స్పందన
- పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద కొద్దిమంది జనం
- వారంతా ఆటోల్లో తీసుకువచ్చినవారే
- ఆ తర్వాత జనం లేకపోవడంతో బస్సులోకి వెళ్లి కూర్చున్న జగన్
- రోడ్డుపక్కన ఉన్న ఇద్దరు, ముగ్గురికీ నమస్కారం చేసుకుంటూ ముందుకు...

నగరంలో మలిరోజు పర్యటనలోనూ అదే సీన్


మధురవాడ చంద్రంపాలెంలో జగన్ బస్సు యాత్ర

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత 'మేమంతా సిద్ధం' పేరుతో జిల్లాలో నిర్వహిస్తున్న బస్సు యాత్రకు మంగళవారం కూడా ప్రజల నుంచి స్పందన కరువైంది. నగర పరిధిలో ఆదివారం రోడ్‌షో నిర్వహించిన ఆయన...సోమవారం యాత్రకు విరామం ప్రకటించారు. 21వ రోజు యాత్రలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎండాడలోని ఎంవీవీ సిటీ వెనుక బస చేసిన ప్రాంతం నుంచి బస్సు యాత్రను జగన్ ప్రారంభించారు. అప్పటికే ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల నుంచి ఆటోల్లో తరలించిన జనాలను నాయకులు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద జాతీయ రహదారి పక్కన నిలబెట్టి ఉంచారు. ఉదయం ఎనిమిది గంటలకే వారందరినీ అక్కడకు తీసుకువచ్చారు. తొమ్మిది నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో వారంతా విలవిల్లాడిపోయారు. సీఎం జగన్ బస్సుపై నిలబడి వారందరికీ అభివాదం/నమస్కారం చేసుకుంటూ ముందుకుసాగారు. అయితే ... మిగతా 4వ పేజీలో


సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం లేఅవుట్‌లో పునాదులు స్థాయిలో ఉన్న జగనన్న ఇళ్లు

పునాదుల్లోనే జగనన్న ఇళ్లు

సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి శంకుస్థాపన

- ఏడాదిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటన
- ఇప్పటికీ 80 శాతం బేస్‌మెంట్ లెవెల్‌లోనే...
- నత్తనడకన సాగుతున్న పనులు
- కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడమే కారణం?



సబ్బవరం, ఏప్రిల్ 23:

మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో రెండేళ్ల క్రితం సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాదిలో ఇళ్లు కట్టిస్తామన్న సీఎం హామీ నేటికీ నెరవేరలేదు. వేలల్లో మంజూరు చేయగా కనీసం ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు.

జగనన్న కాలనీల కోసం సబ్బవరం మండలం పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం, నంగినారపాడు, అజనగిరి, గొల్లలపాలెం, అసకపల్లి, గాలిభీమవరం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు సేకరించారు. వీఎంఆర్‌డీఏ అధికారులు ఎనిమిది గ్రామాల్లో 11 లేఅవుట్లు అభివృద్ధి చేసి 39,527 మంది లబ్ధిదారులకు సెంటు (48.4 గజాలు) చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలోని 320.83 ఎకరాల్లో వీఎంఆర్‌డీఏ అధికారులు మెగా లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లో విశాఖపట్నం, గాజువాక, గోపాలపట్నం, ... మిగతా 4వ పేజీలో

కోడ్ ఉన్నా ఏయూలో అచీవర్స్‌డే!

- 26న నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకేనని విమర్శలు
- ప్రభుత్వానికి సానుకూలంగా మాట్లాడేలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ట్రైనింగ్?
- అధికారుల తీరుపై నగర వాసుల విస్మయం

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం, ఆ పార్టీకి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా, నిబంధనలకు వ్యతిరేకమని ఎంతమంది గగ్గోలు పెట్టినా అధికార పార్టీ సేవలో తరిస్తూనే ఉన్నారు. తాజాగా మరో కార్యక్రమానికి రంగం సిద్ధం చేశారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ అచీవర్స్ డే పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, జగన్ సర్కారు ఏలుబడిలో నిరుద్యోగులకు ఎంతో మేలు జరిగిందని ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన పలువురు విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించారు. వీరిని తల్లిదండ్రులు సమక్షంలో సత్కరించేందుకు వర్సిటీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈనెల 26న అచీవర్స్ డే పేరుతో పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిపి సుమారు 1,400 మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అయితే ఈ కార్యక్రమం నిర్వహణ పట్ల పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ ... మిగతా 4వ పేజీలో

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి...

సింగపూర్ తరహాలో విశాఖ అభివృద్ధి చెందాలి



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- అదే నా ఆశయం
- ఉక్కు పరిరక్షణ 'కూటమి'తోనే సాధ్యం
- పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పుతాం
- ప్రముఖ ఐటీ కంపెనీలను నగరానికి తీసుకువస్తాం
- పోర్టు కాలుష్యం సమస్య పరిష్కారానికి కృషిచేస్తా
- గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతాం
- అంతర్జాతీయ పర్యాటకులు వచ్చేలా ప్రాజెక్టులు తీసుకువస్తా
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి
- నగరంలో 75 శాతం దాటాలి

'ఆంధ్రజ్యోతి'తో కూటమి ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)

తాను ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బు సంపాదించేందుకునేందుకు కాదని విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎం.శ్రీభరత్ అన్నారు. ప్రపంచానికి రోల్‌మోడల్‌గా ఉన్న సింగపూర్ మాదిరిగా విశాఖ నగరం అభివృద్ధి జరగాలన్నదే తన ఆశయమన్నారు. విశాఖ మాదిరిగా ఒకప్పుడు సింగపూర్ కూడా మత్స్యకార పల్లె అని, అయితే 'లీకూన్' నాయకత్వంలో ఆ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, అదే తరహాలో విశాఖను ఆర్థిక నగరంగా, పర్యాటకపరంగా అభివృద్ధి చేయడం, ఉపాధికి కేరాఫ్‌గా మార్చడం కష్టమేమీ కాదన్నారు. ప్రశాంతతకు మారుపేరుగా గుర్తింపుపొందిన విశాఖలో ఇప్పుడు అదుపుతప్పిన శాంతి భద్రతలను తాను గాడిలో పెట్టేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఎన్నికల్లో రెండోసారి బరిలోకి దిగబోతున్న శ్రీభరత్... విశాఖ అభివృద్ధి, నగరంలో శాంతిభద్రతల సమస్య, పరిశ్రమలు, ఐటీ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, తదితర అంశాలపై తన ఆలోచనలను మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... ... మిగతా 4వ పేజీలో



రూ.1.3 కోట్లకు సైబర్ నేరగాళ్ల టోకరా

- ఉచ్చులో పడిన నగరంలోని లాజిస్టిక్స్ వ్యాపారి
- తక్షణం స్పందించిన సైబర్ పోలీసులు
- రూ.85,70,923 హోల్డ్‌లో పెట్టిన వైనం

ఎండాడ, ఏప్రిల్ 23:



నగరానికి చెందిన ఓ లాజిస్టిక్స్ వ్యాపారి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.1,30,30,639 పోగొట్టుకున్నాడు. మోసపోయానని తెలుసుకుని 1930 హెల్ప్ లైన్‌కి కాల్ చేయడంతో సకాలంలో స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు రూ.85,70,923ను హోల్డ్ చేయగలిగారు. ఈనెల 20వ తేదీన జరిగిన సంఘటనపై సైబర్ క్రైం పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం...

నగరానికి చెందిన లాజిస్టిక్స్ వ్యాపారికి ఈనెల 20న ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ముంబైలో ఫెడెక్స్ కొరియర్ ప్రతినిధినంటూ ముంబై నుంచి తైవాన్‌కు మీపేరుపై పార్శిల్ బుక్ అయిందని, అందులో నిషేధిత, చట్టవిరుద్ధ వస్తువులు, ఫేక్ పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లతో పాటు 720 గ్రాముల డ్రగ్స్ ఉన్నట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారని బెదిరించాడు. అటువంటి పార్శిల్ తాను బుక్ చేయలేదని లాజిస్టిక్ వ్యాపారి చెప్పడంతో, అతడి వివరాలు, ఎక్కడ ఉంటున్నదీ, ఫోన్ నంబర్లు కూడా చెప్పడంతో కంగారుపడ్డాడు. అంతేకాకుండా పార్శిల్ మీద ఎఫ్ఐఆర్ నంబరు ఎంహెచ్ 1085/ 1223 బుక్ అయిందని, నార్కోటిక్ పోలీసులకు కాల్ బదలాయిస్తున్నామని చెప్పాడు. విచారణ నిమిత్తం ముంబైకి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశాడు. అయితే తాను అంత దూరం రాలేనని బాధితుడు బదులివ్వడంతో ఉన్నతాధికారికి ఫోన్ కలుపుతున్నామని, ఆన్‌లైన్‌లో విచారణ చేస్తారని బదులిచ్చాడు. వెంటనే మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి ఓ స్కైప్ ఐడీ ఇచ్చి అందులో లాగిన్ కావాలని చెప్పాడు. మీరు ఎవరితోనూ మాట్లాడకూడదని, తాము చెప్పినట్టు నడుచుకోవాలని చెప్పడంతో బాధితుడు అలానే చేశారు.

మీ బ్యాంకు ఖాతా ద్వారా మనీల్యాండరింగ్ ... మిగతా 4వ పేజీలో

నామినేషన్ల కోలాహలం

ఆరో రోజు పార్లమెంటు స్థానానికి ముగ్గురు, అసెంబ్లీ సెగ్మెంట్లకు 18 మంది నామినేషన్

- కొంతమంది రెండేసి సెట్లు దాఖలు
- ఉత్తర నియోజకవర్గానికి కూటమి అభ్యర్థిగా పి.విష్ణుకుమార్‌రాజు నామినేషన్
- నేడు పల్లా, గణబాబు నామినేషన్లు


ఉత్తర నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి ఆరో రోజైన మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నవతరం పార్టీ తరపున గండికోట రాజేశ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పులుసు సత్యనారాయణ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థినిగా మళ్ల శ్రావణి నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నుంచి విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ఆర్వో, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రజాశాంతి పార్టీ నుంచి కిలారి ఆనంద్‌పాల్ (కేఏ పాల్) మంగళవారం మరో సెట్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. నామినేషన్ పత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పరిశీలించారు.


ఏడు అసెంబ్లీ స్థానాలకు 18 మంది నామినేషన్లు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు మంగళవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆరో రోజు 18 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. భీమిలి నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా చొప్పల్లి శరవణ్ గణేష్, బావిశెట్టి రమణబాబు నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. విశాఖ తూర్పు అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా శివరామకృష్ణ అనగాని, డాక్టర్ మాతే సురేష్, దక్షిణ నియోజక వర్గానికి వైసీపీ అభ్యర్థిగా జె.బిపిన్‌కుమార్ ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్‌కుమార్ రెండు సెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఉత్తర నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా పెనుమత్స ... మిగతా 4వ పేజీలో

మండిన నగరం

- వడగాడ్పులతో ఠారెత్తిన జనం

ఎయిర్‌పోర్టులో 40.4 డిగ్రీలు నమోదు



విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పడమర గాలులతో మంగళవారం నగరం ఉడికిపోయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి నిప్పుల కుంపటిలా మారింది. అత్యవసరపనులపై బయటకు వచ్చిన వారంతా ఎండ దెబ్బకు అల్లాడిపోయారు. ఇళ్లలో ఉండే వారు కూడా ఏసీలపై ఆధారపడాల్సి వచ్చింది. మంగళవారం ఎయిర్‌పోర్టులో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెలలో 40 డిగ్రీలు దాటి నమోదు కావడం ఇది రెండోసారి. బుధవారం కూడా ఎండలు, గాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

పొట్టకూటికి వచ్చి ప్రాణాలు కోల్పోయారు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


ప్రాణాలు కోల్పోయిన యువకులు

మహరాణిపేట, ఏప్రిల్ 23: బతుకుతెరువు కోసం నగరానికి వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. వేర్వేరు జిల్లాల నుంచి వచ్చిన వీరు చిన్నచిన్న పనులు చేసుకుంటూ పొట్టుపోసుకుంటున్నారు. వీరిలో ఒకరికి తల్లిదండ్రులు లేరు. మరొకరికి తల్లి ఉన్నా ఆమె దూరంగా ఉంటున్నారు. అర్ధరాత్రి వేళ ద్విచక్ర వాహనంపై వెళుతూ అంబులెన్స్‌ను ఢీ కొనడంతో ఇద్దరూ మృతిచెందారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3.00 గంటల సమయంలో చిత్రాలయ థియేటర్ సమీపంలో సూర్యాబాగ్ వద్ద జరిగిన ఈ విషాద ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ (19)కు తల్లిదండ్రులు లేరు. సమీప బంధువులు విశాఖలో ఉండడంతో ఇక్కడకు వచ్చి చిన్నిచిన్న పనులు చేసుకుంటూ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నిద్రిస్తూ ఉంటాడు. బొబ్బిలి ప్రాంతానికి చెందిన చందు (20) కూడా పనుల కోసం నగరానికి వచ్చాడు. ఇద్దరూ స్నేహంగా ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున వీరిద్దరూ ... మిగతా 4వ పేజీలో



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న వంశీకృష్ణ



ప్రచారంలో వంశీకృష్ణ సతీమణి పద్మజ

జనసేనలో మహిళలు, యువకులు చేరిక

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. జీవీఎంసీ పరిధి 39వ వార్డుకు చెందిన మహిళలు, యువత జనసేన పార్టీలోకి మంగళవారం చేరారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని కృష్ణాగార్డెన్స్‌లోని రాజుగౌడ్, పరదేశి ఆధ్వర్యంలో పలువురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ వీరందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమకు నియోజక వరిధిలో ప్రజలనుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. అనేక వర్గాలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారన్నారు. దీనిని బట్టీ జనసేన, టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు గెలుపుకు అనుకూల వాతావరణం కనిపిస్తోంది. కూటమి శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కూటమి చేయనున్న అభివృద్ధిని వివరించాలనికోరారు. నియోజవర్గ సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరదేశమ్మ, పరమేశ్వరి, రాజేశ్వరీ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ పరిసరాల్లో వంశీకృష్ణ సతీమణి ప్రచారం..

జీవీఎంసీ పరిధి 27వ వార్డు శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లోని దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ సతీమణి పద్మజ ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా వంశీకృష్ణకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్ తదితర నేతలు



నామినేషన్ల కోసం వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు

న్యాయానికి, రౌడీయిజానికి మధ్య పోటీ

- ఔచిత్యంతో ఓటువేయాలని ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అభ్యర్థన
- అట్టహాసంగా నామినేషన్ దాఖలు

సీతమ్మధార/ మురళీనగర్ ఏప్రిల్ 23: నీతి, నిజాయితీకి, రౌడీయిజానికి మధ్య ప్రస్తుత ఎన్నికల్లో పోటీ జరుగుందని, ప్రజలు ఔచిత్యంతో ఆలోచించి ఓటు వేయాలని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. విష్ణుకుమార్‌రాజు మంగళవారం నామినేషన్ వేశారు. నేతలు సంస్కృతి, సంప్రదాయాల తెలిపేలా లుంగికట్టు, తల పాగాతో భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులతో కలిసి సీతమ్మధారలో బీజేపీ కార్యాలయం నుంచి కూటమి అభిమానులు, నాయకులు పాద యాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన ఇన్ చార్జి పసపులేటి ఉషాకిరణ్, డాక్టర్ రఘు, విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక, బీజేపీ నేతలు పరశురామ్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యాలయంలో ఆర్‌వోకు నామినేషన్ ప్రతాలుఅందజేశారు. అనంతరం బయటకు వచ్చిన విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ తన నామినేషన్‌కు వచ్చిన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నీతినిజాయితీ, ధర్మం కోసం తాను పోటీ చేస్తుంటే.. రౌడీయిజంతో నిబంధనలను ఉల్లఘించి వైసీపీ అభ్యర్థిగా కేకే రాజు రాజు తలపడుతున్నారని అన్నారు. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. శ్రీభరత్ మాట్లాడుతూ ఉన్నత వ్యక్తిత్వంతో ప్రజలమన్ననలందుకుంటున్న విష్ణుకుమార్‌రాజు భారీ మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. అనంతరం అల్లూరి సీతారామా రాజు విగ్రహానికి నివాళులర్పించారు. మాధవధారలో టీడీపీ నేతలు సనపల.కీర్తి, సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా నామినేషన్లకు వచ్చారు. 25వ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, నాయకులు ఈ తలపాక సుజాత, ఇసరపు వాసు, బర్ల పద్మలత, బొడ్డేటి మోహన్, బీజేపీ ఉత్తర ఇన్ చార్జి సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ వేషధారణ, సాముగరిడీల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాప్రమాణాలు ఉంటాయని ఆర్‌బీఎం యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్.ప్రభాకర్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962లో పాఠశాల ప్రారంభమైన తరువాత 2006 నుంచి ప్రాథమికోన్నత పాఠశాలగా మారిందన్నారు. ఈ క్రమంలో ఇక్కడ చదువుకున్న ఎంతోమందిఉన్నతస్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఎంఈవో- 1 మహారాణిపేట పైడపునాయుడు, ఎంఈవో- 2 బి.పుష్పరాగం, ఎంఈవో -1 సీతమ్మధార డి.రామారావులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కనకరావు, కె.రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్: ఎస్ఐ



ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వాణిశ్రీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 23: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టడానికి వీలువుతుందని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ వాహనచోదకులకు సూచించారు. రైల్వేన్యూకాలనీలో మంగళవారం సాయంత్రం సుప్ర వాహనంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతమ్మధార, ఏప్రిల్ 23: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని శ్రీ కృష్ణ మదిరం వద్ద గల వేద సంరక్షణ సభా ప్రాంగణంలో వైదిక విజ్ఞాన విపంచి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి ; డీటీసీ

మురళీనగర్, ఏప్రిల్ 23; ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో వాహనాల డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జి.సి. రాజారత్నం సూచించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్లు అధికంగా నీరు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే డ్రైవింగ్ చేయకుండా తగిన వైద్య పరీక్షలు చేయించుకుని సేద తీరాలన్నారు. హెవీ వెహికల్స్ టైర్లలో పరిమితికి మించి గాలి నింపకూడదన్నారు.

'పది' ఫలితాల్లో 'విద్యోదయ' విద్యార్థులు ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భగీరథ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: నిరంతర సాధనతో ఫలితాలు సాధింవచ్చునని తమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాలు నిరూపించాయని డాబాగార్డెన్స్‌లోని విద్యోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ భగీరథ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు సాధించిన విద్యార్థులను హై స్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు తమ విద్యార్థులు 291 మంది హాజరై శత శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. వీరిలో వాసుపల్లి తేజ 592 ప్రథమ స్థానం, ఆదిత్య శర్మ, మహమ్మద్ అర్క్ 591, వి.వైష్ణవి 590, మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారన్నారు. 580 మార్కులకుపైగా 21 మంది విద్యార్థులు, 570 మార్కులకుపైగా 39 మంది, 560 మార్కులకుపైగా 52 మంది, 550 మార్కులకు పైగా 76 మంది, 152 మంది 500 మార్కులకు పైగాసాధించారన్నారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు.

ఓటర్ల చైతన్యంపై అవగాహన



మాట్లాడుతున్న సీబీసీ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర్‌చౌదరి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీబీసీ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర్‌చౌదరి హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో అంతా భాగస్వామ్యం కావాలన్నారు. అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.రామారావు, సీబీసీ సహాయ సంచాలకులు షఫీ మహమ్మద్ మాట్లాడుతూ దేశంలో ఓటింగ్ శాతం పెరగడానికి యువత భాగస్వామ్యం ఎంతో అవసరమనానరు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, స్వీప్ అధికారులు పుష్పరాజు, పోలినాయుడు, విశాఖ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బాలకృష్ణ, విద్యార్థుల పాల్గొన్నారు.

28న గౌడ ఎడ్యుకేషన్ అవార్డులు ప్రదానం

మహారాణిపేట, ఏప్రిల్ 23: గౌడ సామాజిక సంక్షేమ సంఘం ద్వారా ఈనెల 28న గౌడ ఎడ్యుకేషన్ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు విశాఖ జిల్లా సం ఘం అధ్యక్షుడు మార్గన రామారావు తెలిపారు మం గళవారం మహారాణిపేటలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28 వ తేదీన ఈ కార్యాలయంలో ఎడ్యుకేషన్ అవార్డులతోపాటు గౌడ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘంలోని కుటుంబలు తమ పిల్లల ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు ఈ నెల 26వ తేదీలోగా అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కామన వెంకట సుబ్బారావు నారాయణ, జెర్రిపోతుల ప్రసాద్, అత్తిలి శంకరరావు, మేరువ గణేష్, మట్టా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ రోడ్‌షో వెలవెల

... 3వ పేజీ తరువాయి

స్టేడియం దాటేసరికి ఒక్కరు కూడా రోడ్డు మీద లేకపోవడంతో జగన్ బస్సుపై నుంచి దిగి లోపల కూర్చున్నారు. అక్కడి నుంచి రోడ్డుపక్కన నిలబడి చూస్తున్న వారికి నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం, బోయిపాలెం జంక్షన్ల వద్ద కొద్ది సంఖ్యలో మాత్రమే జనం కనిపించడంతో వారికి బస్సులో నుంచే జగన్ నమస్కారం చేశారు. ఆనందపురం జంక్షన్‌లో కూడా పెద్దగా జనం లేరు. పూలమార్కెట్ వద్ద కొంతమంది ఉండడంతో సీఎం జగన్ మళ్లీ బస్సుపైకి వారికి నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లి తర్వాత బస్సులోకి వెళ్లి కూర్చుండిపోయారు. అనంతరం అక్కడకు కొద్దిదూరంలో ఉన్న చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్లతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత విజయనగరం బయలుదేరి వెళ్లారు.

కోడ్ ఉన్నా ఏయూలో అచీవర్స్‌డే!

... 3వ పేజీ తరువాయి

అమల్లో ఉండగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా..కార్యక్రమం నిర్వహణకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఇచ్చారని బదులిచ్చారు. విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందిం చడంతోపాటు తల్లిదండ్రులను సత్కరిస్తామని వివరించారు.

వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకే...

వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకే ఏయూ అధికారులు ఇంత పెద్దఎత్తున కార్యక్రమం చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేవనే నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఇటువంటి తరుణంలో ఏయూ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని వైసీపీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహంపై ఈ కార్యక్రమంలో మాట్లాడించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారంటున్నారు.

రూ.1.3 కోట్లకు సైబర్ నేరగాళ్లు టోకరా

... 3వ పేజీ తరువాయి

జరిగిందని, మీ అకౌంట్స్ నుంచి తీవ్రవాదులకు (తుపాకుల కొనుగోలు నిమిత్తం) డబ్బులు అందాయని చెబుతూనే, ప్రస్తుతం మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును మాకు ట్రాన్స్‌ఫర్ చేస్తే, ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఖాతాను చెక్ చేసి, తిరిగి అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మబలికారు. దీనికితోడు ఆర్బీఐకి సంబంధించిన లెటర్‌ని బాధితునికి ఆన్‌లైన్‌లో పంపించాడు. బాధితుడు వారు చెప్పినట్టే తన ఖాతాలోని రూ.1,30,30,639 నగదును వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే దీనిపై అనుమానం వచ్చి వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో సైబర్ క్రైం జోన్-2 సీఐ జి.శ్రీనివాసరావు బృందం వివరాలు సేకరించి, పోగొట్టుకున్న నగదులో రూ.85,70,923 మొత్తాన్ని హోల్డ్ చేయగలిగారు.

పునాదుల్లోనే జగనన్న ఇళ్లు

... 3వ పేజీ తరువాయి

మధురవాడ తదితర ప్రాంతాలకు చెందిన 9,717 మందికి సెంటు చొప్పున కేటాయించారు.

ఈ మేగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అదే వేదిక మీద లబ్దిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఏడాదిలోగా లబ్ధిదారులకు సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఈ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పనులు రాక్రీట్ ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. అయితే రెండేళ్లుగా నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు వెయ్యి ఇళ్లు స్లాబ్ దశను దాటి ప్లాస్టింగ్ పనులు జరుగుతుండగా, సుమారు వెయ్యి ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయి. మిగిలిన ఏడు వేల ఇళ్లు ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. మండలంలోని మిగతా లేఅవుట్లలో కూడా నత్తనడకన ఇళ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. బిల్లులు మంజూరు కాకపోవడం వల్లనే ఇళ్ల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతుందని అక్కడ పని చేసే సిబ్బంది చెబుతున్నారు.

పరిహారం ప్లాట్లు అభివృద్ధి అంతంత మాత్రమే..

భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద ఇచ్చే ప్లాట్లు సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తామని సీఎం అదే సభలో చెప్పారు. పరిహారం (ఆర్‌సీ) ప్లాట్లు రైతులకు అప్పగించిన తరువాతే ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ పరిహారం ప్లాట్ల అభివృద్ధి పనులు సాగుతూ...నే ఉన్నాయి. అది కూడా రైతులు పలుమార్లు నిరసన వ్యక్తం చేసి, అనకాపల్లి కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఇటీవల పరిహారం ప్లాట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

కాలనీపైకి వరద

ఇదిలావుండగా పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీకి ఎగువనున్న కొండల పైనుంచి వచ్చే వరద నీరు పోయేందుకు మార్గం ఏర్పాటుచేయకుండా వీఎంఆర్‌డీఏ అధికారులు లేఅవుట్ వేసేశారు. దీంతో భారీవర్షాలు కురిసినప్పుడల్లా లేఅవుట్ ముంపునకు గురవుతోంది. ఈ నీరు రైతులకు పరిహారం కింద ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్లను ముంచెత్తడంతో వారు గగ్గోలు పెట్టారు. కొంతమంది రైతులకు ఆర్‌సీ ప్లాట్లు గెడ్డలో ఇచ్చారు. ఇదే గెడ్డలోకి ఎగువన ఉన్న తుమ్మల చెరువు మిగులు నీరు కూడా వచ్చి ప్లాట్లను ముంచెత్తేది. దీనిపై రైతులంతా అనేకసార్లు నిరసనలు వ్యక్తం చేయడంపాటు అనకాపల్లి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో తుమ్మల చెరువు నుంచి మిగులు నీరు పోయేందుకు సీసీ కాలువ నిర్మిస్తామని రైతులకు వీఎంఆర్‌డీఏ అధికారులు హామీ ఇచ్చారు. అలాగే కొండల పైనుంచి వరద నీరు లేఅవుట్‌లోకి రాకుండా ఆ వాలులో ట్రెంచ్‌లు ఏర్పాటుచేసి, ఆ నీటిని చెరువులకు మళ్లిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పారు.

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి...

... 3వ పేజీ తరువాయి

సింగపూర్ తరహాలో విశాఖ అభివృద్ధే లక్ష్యం

మనం, మన ప్రాంతం అభివృద్ధి కోసం పెద్ద స్థాయిలో లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధనకు కృషిచేయాలి. పెద్ద కలలు కని వాటి సాధనకు యత్నించాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అనేవారు. అదే మాదిరిగా భారీ లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించిన ధీరోదాత్తుడు లీకూన్. ఆయన సారథ్యంలో సింగపూర్ అభివృద్ధి చెందింది. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని విశాఖను అభివృద్ధి చేయాలన్నదే నా ఆలోచన, ఆశయం. సింగపూర్‌లా విశాఖలో ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వసతుల కల్పన, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నదే నా ఆశయం. ఇంకా సింగపూర్ మాదిరిగా ఆర్థిక నగరంగా మార్చినప్పుడే ప్రపంచంలో విశాఖ పేరు మార్మోమోగుతుంది.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం. ఇలాగే 2002లో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొని బీఐఎఫ్‌ఆర్‌కు వెళ్లినప్పుడు నాడు సీఎం చంద్రబాబునాయుడు చొరవతో ఎంపీలు ఎంవీవీఎస్ మూర్తి, కింజరాపు ఎర్రన్నాయుడు తదితరులు అప్పటి ప్రధాని వాజపేయి వద్దకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. ఆ తరువాత కర్మాగారం శరవేగంగా ఏడు మిలియన్ టన్నుల ఉత్పత్తి స్థాయికి చేరుకుని దేశానికే తలమానికంగా మారింది. ఇప్పుడు కూడా కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే ఉండాలంటే సెయిల్‌లో విలీనం చేయాలి. అప్పుడే సొంత గనులు దక్కుతాయి. ఈ ప్రక్రియ కూటమి ప్రభుత్వానికి సాధ్యమవుతుంది. మూడేళ్లుగా ఉక్కు కార్మికులు ఆందోళన చేస్తున్నా కార్మిక సంఘాలు, విపక్ష పార్టీల నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానిని కలిసి సమస్య పరిష్కారానికి చొరవ చూపడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటుకు యత్నిస్తాం

ఉత్తరాంధ్రకు గేట్‌వేగా ఉండే విశాఖలో చాలాకాలం క్రితం భారీ పరిశ్రమలు వచ్చాయి. తరువాత ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలు రాకపోవడం వాస్తవమే. దీనిపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో ఎటువంటి పరిశ్రమలు అనువుగా ఉంటాయో ఆలోచించి ప్రణాళికలు వేసి అమలుచేయాలి. ఇప్పటికే ఉన్న భారీ పరిశ్రమల విస్తరణ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తాను. ముఖ్యంగా ఫార్మా, మత్స్య సంపద ఎగుమతి విషయంలో దృష్టిసారిస్తే వ్యాపార అవకాశాలు పెరిగి ఉపాధి దొరికి నగరం అభివృద్ధి చెందుతుంది.

ఐటీ కంపెనీల రాకకు కృషి

విశాఖకు ఇప్పటివరకు ఐటీలో చిన్న కంపెనీలు, బీపీవో సర్వీసులు అందించే సంస్థలే వచ్చాయి. పెద్ద కంపెనీలు హైదరాబాద్‌కు పరిమితమయ్యాయి. పెద్ద కంపెనీలను తీసుకురావడంలో గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చంద్రబాబునాయుడు హయాంలో విశాఖకు ఫ్రాంక్లిన్ టెంపుల్ కంపెనీ వచ్చింది. కొద్దిరోజుల్లో కంపెనీ ఏర్పాటవుతుందనగా ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ వెనక్కి వెళ్లిపోయింది. అలాగే అదానీ డేటా సెంటర్‌కు చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అన్ని రకాలుగా అడ్డుకుంది. అదే డేటా సెంటర్‌కు ఏడాది క్రితం మళ్లీ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇంకా స్టార్టప్‌లు, ఐటీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇతరత్రా రంగాలకు ముడిపడి ఉన్న కంపెనీలు రావాలంటే వాటిలో పనిచేసేందుకు నిపుణులు లభ్యత ముఖ్యం. అటువంటి నిపుణులు స్థానికంగా రావాలంటే ఇక్కడ ప్రముఖ విద్యా సంస్థలతో ఐటీ కంపెనీలు ఒప్పందాలు చేసుకునివిద్యార్థులను తీర్చిదిద్దాలి. ఉత్తరాంధ్రలో వేలాది మంది యువత ఉపాధితోపాటు శిక్షణకు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. అటువంటి యువతను విశాఖలో శిక్షణ ఇచ్చి ఇక్కడే ఉపాధి కల్పిస్తే పెద్ద కంపెనీలు వస్తాయి. ఇందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి. అటువంటి కృషి చంద్రబాబునాయుడు మాత్రమే చేయగలరు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రముఖ కంపెనీలను విశాఖకు రప్పించేందుకు ప్రయత్నం చేస్తాం.

పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం పునరుద్ధరణ

గత ఐదేళ్లలో విశాఖతోపాటు రాష్ట్రంలో పరిశ్రమల నిర్వహణ, విస్తరణ, ఏర్పాటుకు అనువైన వాతావరణం పూర్తిగా పోయింది. చివరకు పరిశ్రమల విస్తరణ చేద్దామన్నా అనేక ఇబ్బందులు సృష్టించారు. ఒక విధంగా చెప్పాలంటే పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం చెడగొట్టారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్సాహంతో ఉన్నా...ఇక్కడ వాతావరణంతో వారంతా మౌనంగా ఉండడం లేదా ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం జరిగింది. మంచి ప్రభుత్వం వస్తే ఇక్కడకు వచ్చేందుకు అనేకమంది వ్యాపారులు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికగా శాంతిభద్రతల సమస్యను పరిష్కరించి సమర్థులైన అధికారులకు బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తాం.

నగర కాలుష్యాన్ని అరికట్టాల్సిందే

విశాఖ నగరంలో లక్షల జనాభా నివసిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంగా ఉండాలంటే నగరం పరిశుభ్రంగా ఉండాలి. అయితే విశాఖ పోర్టు నుంచి వచ్చే కాలుష్యం నగర ప్రజల్ని ఉక్కిరిబిక్కిరిచేస్తుంది. ముఖ్యంగా పోర్టులో దిగుమతి అయ్యే బొగ్గు వల్లే కాలుష్యం వస్తోంది. పోర్టు యాజమాన్యం నివారణ చర్యలు తీసుకున్నా ఫలితం ఉండడం లేదు. కాలుష్యం పోవాలంటే బొగ్గు దిగుమతి నిలిపివేసి మరో పోర్టుకు తరలించాలి. పోర్టులో కేవలం కార్గో రవాణాకు మాత్రమే అనుమతించాలి. దీనిపై కేంద్రస్థాయిలో నిర్ణయం తీసుకునేలా కృషిచేస్తాను. బొగ్గు దిగుమతి నిలిపివేస్తే తప్ప వన్‌టౌన్ ప్రాంతాన్ని రక్షించడం కష్టం. ఈ విషయంలో ప్రజలు, పౌర సంఘాల సూచనలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాను.

పర్యాటకంగా అనేక విభాగాల అభివృద్ధి

పర్యాటకం అనగా గుర్తుకొచ్చే నగరం విశాఖ. అయితే విశాఖలో బీచ్ టూరిజం విస్తరణకు కొన్ని పరిమితులు ఉన్నాయి. ఇక్కడ కెరటాలు ఉధృతి ఎక్కువగా ఉండడం, లోతు సమస్యలుగా ఉన్నాయి. అందువల్ల బీచ్‌లో క్రీడలు వంటి వాటిని ప్రోత్సహించాలి. ఏజెన్సీలో పర్యాటకం కోసం మౌలిక వసతులు కల్పించాలి. విశాఖ ప్రాంతంలో బౌద్ధమత పర్యాటక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించవచ్చు. అంతర్జాతీయ పర్యాటకులను విశాఖకు రప్పించేలా ప్రాజెక్టులు తీసుకువస్తే పెద్దఎత్తున ఉపాధి దొరుకుతుంది. అందుకు కృషివస్తా.

గంజాయి, మత్తు పదార్థాల అరికడతాం

గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, ఇతర ప్రాంతాలకు రవాణా ఆందోళన కలిగిస్తోంది. లక్షల మంది యువత నిర్వీర్యం కావడం...అటు సమాజానికి ఇటు కుటుంబాలకు తీవ్ర ఆవేదన, ఆందోళన కలిగిస్తోంది. ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా విషయంలో ప్రభుత్వ వైఫల్యం ఉంది. ప్రపంచంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు విశాఖలో ఉన్నట్టు తేలుతుంది. ఇది సిగ్గుచేటైనా అంశం. ఇంకా డ్రగ్స్ దిగుమతి కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చెప్పాలి. విశాఖకు వేల టన్నుల మత్తు పదార్థాలు దిగుమతి అవుతున్నాయని కేంద్రానికి సమాచారం రావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కేసు దర్యాప్తునకు అధికారులు అడ్డుతగిలారని సీబీఐ కూడా పేర్కొంది. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, రవాణాపై ఉక్కుపాదం మోపాలి. అది ఈ ప్రభుత్వానికి సాధ్యంకాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని అరికడతాం. అందుకు కేంద్ర సాయం కోసం యత్నిస్తాను.

ప్రజాసేవలోనే ఎక్కువ ఆనందం

2019లో ఎంపీగా పోటీ చేసే సమయానికి రాజకీయంగా అనుభవం తక్కువ. అప్పట్లో త్రిముఖ పోటీ ఉండడంతో స్వల్ప తేడాతో ఓడిపోయా. గడచిన ఐదేళ్లలో ఒకపక్క ప్రజలకు అందుబాటులో ఉంటూ, మరోపక్క పార్టీ నాయకులు, కేడర్‌ను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నాను. గ్రామాలు, నగరంలోని మురికివాడలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నా. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు మరింతగా సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చాను. తాతలు ఎంవీవీఎస్ మూర్తి, కావూరి సాంబశివరావుల నుంచి రాజకీయాలకు సంబంధించి అనేక విషయాలు నేర్చుకున్నా. సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాను తప్ప డబ్బు సంపాదించుకునేందుకు కాదు. యూనివర్సిటీ చైర్మన్‌గా ఉన్న నేను అక్కడే ఎక్కువ సమయం కేటాయిస్తే మరింత సంపాదించుకోవచ్చు. కానీ రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు సేవ చేయడంలో ఎక్కువ ఆనందం, తృప్తి ఉంటాయి.

నగరంలో ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలి

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది గొప్ప ఆయుధం. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలి. గ్రామీణ ప్రాంతంలో 70 శాతం దాటి ఓటింగ్ జరుగుతుంది. నగరంలో మాత్రం 2019లో 67 శాతానికి పరిమితమైంది. ఈసారి నగరంలో ప్రతి ఒక్కరూ ఓటువేసి 75 శాతం ఓటింగ్ జరిగేలా సహకరించాలి. విశాఖ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతుంది. ప్రతిచోట ప్రజల నుంచి విశేషమైన మద్దతు లభిస్తోంది. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంటు పరిధిలో ఓటర్లంతా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలి. అప్పుడే అంతా కోరుకునే సుందర విశాఖ స్వప్నం కల సాకారం అవుతుంది.

పొట్టకూటికి వచ్చి ప్రాణాలు కోల్పోయారు

... 3వ పేజీ తరువాయి

తమకు తెలిసిన యువకుడి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని పోలీసు బ్యారెక్స్ వైపు నుంచి జీవీఎంసీ జోన్- 4 కార్యాలయం వైపు వస్తున్నారు. ఈ క్రమంలో లీలామహల్ థియేటర్ వైపు నుంచి జగదాంబ జంక్షన్ వైపు వస్తున్న 108 అంబులెన్స్‌ను బలంగా ఢీ కొన్నారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అయినా, పరిస్థితి విషమించి ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆసుపత్రిలో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్ల కోలాహలం

... 3వ పేజీ తరువాయి

విష్ణుకుమార్‌రాజు రెండు సెట్లు, పెనుమత్స శ్యామలా దీపిక రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇంకా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వీవీఎస్ కమలాకర్‌రావు ఒక సెట్, రామారావు లక్కరాజు రెండు సెట్లు, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ తరఫున పెద్దాడ కనకమహాలక్ష్మి ఒక సెట్ దాఖలు చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి సమాజ్‌వాదీ పార్టీ నుంచి రవికుమార్ వెలగాడ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థిగా మందపాటి శ్రీనివాసరాజు, గాజువాక నియోజక వర్గానికి సీపీఐ (ఎం) నుంచి మైలవరపు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు అలియాస్ భగవాన్ శ్రీను, పెందుర్తికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్ రెండు సెట్లు నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. కాగా, బుధవారం గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఖబరిస్థాన్ నిర్మాణం కలేనా!

ఎన్నికల సమయంలో ప్రతిపాదనకే పరిమితమైన నేతల హామీలు

శ్మశానవాటిక (ఖబరిస్థాన్) లేక ఇబ్బందులు పడుతున్న రెండు వార్డుల ముస్లింలు

ఈసారైనా సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశగా ఎదురుచూపులు

గోపాలపట్నం, ఏప్రిల్ 23: ప్రభుత్వాలు మారుతున్నా గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో దశాబ్దాల కాలంగా నివసిస్తున్న ముస్లింమైనారిటీల అపరిష్కృత సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. గోపాలపట్నం సమీపంలోని పులంబొట్లపాలెం రెవెన్యూ విలేజ్ కొత్తపాలెంలో శతాబ్ద కాలంగా ముస్లింలు నివసిస్తున్నారు. అప్పట్లో గ్రామ శివారు ప్రాంతమైన ఎర్రచెరువు గట్టు వద్ద కొత్తపాలెంలోని ముస్లింలు శ్మశానవాటికను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కాలక్రమేణ గోపాలపట్నం పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో గడిచిన నాలు దశాబ్దాల్లో గోపాలపట్నం, ఇందిరానగర్, లక్ష్మీనగర్, నందమూరినగర్ ప్రాంతాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు వెయ్యి ముస్లిం కుటుంబాలు స్థిర నివాసాలను ఏర్పర్చుకున్నాయి.

అయితే గోపాలపట్నం, నందమూరినగర్ ప్రాంతాల ముస్లింలకు శ్మశానవాటిక లేక పోకపోవడంతో కొత్తపాలెంలోని శ్మశానవాటికనేవినియోగిస్తున్నారు. కాగా ముస్లింల సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించే సమయంలో మృతదేహాన్ని ఖననం చేస్తుంటారు. కొత్తపాలెంలోని శ్మశానవాటికలో ఈ మూడు వార్డులకు చెందిన ముస్లింల మృతదేహాలను ఖననం చేయడంతో ప్రస్తుతం ఈ శ్మశానవాటికలో ఎక్కడ గొయ్యి తవ్వినా అస్థిపంజరాలు బయటపడుతున్నాయి. దీంతో ఈ ప్రాంత ముస్లింలు చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గోపాలపట్నం, నందమూరినగర్ ప్రాంతాల ముస్లింలకు ప్రత్యేకంగా శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని గడిచిన దశాబ్ద కాలంగా స్థానిక ముస్లింలు నాయకులకు ఏకరువు పెడుతున్నారు. ఈ అంశంపై ఎన్నికల సమయంలో నాయకులు హామీ ఇస్తున్నా.. ఆ తర్వాత అవి అమలుకు నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూడు వార్డుల ముస్లింలు వినియోగిస్తున్న కొత్తపాలెంలోని ఖబరిస్థాన్

ఈసారైనా హామీ నెరవేరేనా?

ప్రస్తుతం 89, 91, 92 వార్డుల్లో సుమారు ఏడు వేల మందికి పైగా ముస్లింలు, దాదాపు మూడు వేలకు పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఆయా వార్డుల పరిధిలో గోపాలపట్నం, కొత్తపాలెం, నందమూరినగర్ ప్రాంతాలు విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోకి వస్తాయి. అయితే 91, 92 వార్డుల పరిధిలోని ముస్లింలకు వెంకటాపురం గ్రామ శివారులోని శ్మశానవాటికలో స్థలాన్ని కేటాయిస్తారని చాలాకాలంగా నేతలు హామీలు ఇస్తున్నారు. అయితే ఇప్పటికీ నెరవేరలేదు. మే 13న ఎన్నికలు జరగనున్నందున ఈసారి కూడా ముస్లింల శ్మశానవాటిక అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే ఈసారైనా ఈ హామీ నెరవేరుతుందా? అని స్థానిక ముస్లింలు చర్చించుకుంటున్నారు. దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చే నేతల వైపై స్థానిక ముస్లింలు మొగ్గుచూపే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కండువాలు వేసి కాతా బాలకృష్ణ, తదితరులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పల్లా శ్రీనివాసరావు

రాష్ట్రాన్ని అప్పుల కూపంగా మార్చిన జగన్

తెలుగుదేశం పార్టీ 'గాజువాక' అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 23: రాష్ట్రాన్ని అప్పుల కూపంగా మార్చడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాస రావు విమర్శించారు. 76వ వార్డులోని సంఘ సేవకుడు, నాయకుడు కాతా బాలకృష్ణతోపాటు పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్దసంఖ్యలో మంగళవారం టీడీపీలో చేరారు. వీరికి కండువాలు వేసి పల్లా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కంపెనీలను కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. వైసీపీ దోపిడీదారులు తప్ప రాష్ట్రంలోని ప్రజలె వరూ ఆనందంగా లేరన్నారు. దుర్మార్గాలు, అక్రమాలు, అవినీతి, రౌడీయిజంతోనే ఐదేళ్ల ప్రజలను ఇబ్బందులకు గురిచేసి పాలన చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం గాజువాక ప్రాంతానికి ఏం చేసిందని ప్రశ్నించారు. ఏ ఒక్క అభివృద్ధి పనిని ఇక్కడ చేపట్టలేదని మండిపడ్డారు. అనకాపల్లిలో చిన్నపాటి అభివృద్ధి పనులు చేపట్టని అమర్‌నాథ్‌ను అక్కడి ప్రజలు ఛీకొట్టారని, అలాంటప్పుడు ఇక్కడి ప్రజలు ఎలా ఆదరిస్తారన్నారు. ప్రజలకు మంచి చేసే వారిని మాత్రమే గాజువాక ప్రాంతీయులు ఆదరిస్తారని పల్లా పేర్కొన్నారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, అందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొండా జగన్, దల్లి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



58వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు



ఆడారి ఆనంద్‌కుమార్‌తో నాయీబ్రాహ్మణులు, తదితరులు

చంద్రబాబు, పవన్ దోస్తీతో వైసీపీలో వణుకు

జనసేన పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



పంచకర్ల రమేశ్‌బాబును సత్కరించిన దాట్ల మధు

పెందుర్తి, ఏప్రిల్ 23: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దోస్తీతో వైసీపీకి వణుకు పుడుతుందని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని దాట్ల మాన్షన్‌లో మంగళవారం టీడీపీ సీనియర్ నేత దాట్ల మధు ఆధ్వర్యంలో 95వ వార్డు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ నియోజకవర్గ ఓటర్లు విజ్ఞులని, వైసీపీ అరాచకాలను ముందుగానే గ్రహించి ఇక్కడ ఐదుగురు టీడీపీ కార్పొరేటర్లను గెలిపించారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుందన్నారు. ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం పంచకర్లను దాట్ల మధు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాసుల నాయుడు, కార్పొరేటర్ సేనాపతి శంకరరావు, నాయకులు ఎ.సింహాచలం, జి.వెంకటరమణ, తాతారావు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని గుర్రమ్మపాలెం, అక్కిరెడ్డిపాలెంలలో పంచకర్ల ప్రచారం సాగించారు. ఇంటింటికీ వెళ్లి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

పతుల కోసం సతీమణుల ప్రచారం

పెందుర్తి ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ వారి సతీమణులు మహాలక్ష్మి, శ్రీదేవి ప్రచారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, జనసేన వీరమహిళలతో కలిసి చినముషిడివాడ, సుజాతనగర్, రాంపురంలలో ప్రచారం చేశారు, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తే అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతుందన్నారు.

రానున్నది వైసీపీ ప్రభుత్వమే..

మల్కాపురం, ఏప్రిల్ 23: రాష్ట్రంలో వైసీపీ పవనాలు వీస్తున్నాయని, రానున్నది వైసీపీ ప్రభుత్వమేనని.. తద్వారా ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు పరిధి ఎదురువానిపాలెం జంక్షన్ నుంచి శ్రీహరిపురం వరకు మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. పలుచోట్ల మహిళలు పూలమాలలు వేసి, మంగళహారుతులిచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. వైసీపీ సమన్వయకర్తగానే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శనీయంగా తీర్దిదిద్దుతానన్నారు. మరోసారి జగన్ సీఎం అయితే ఈ రాష్ట్రం మరింత అభివృద్ధిని సాధిస్తుందన్నారు. టీడీపీ నాయకుల మాటలను ప్రజలు విశ్వసించడం లేదని, జగన్ మాట ఇస్తే తప్పరని.. అందువల్ల వైసీపీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైసీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు (వాసు), మాజీ కార్పొరేటర్లు పిళ్లా కనకరాజు, పీలా ఉమారాణి, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రాంప్రసాద్, నాయకులు కృష్ణమూర్తి, డి.వేణుగోపాల్‌రెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో పిళ్లా రమాకుమారి ప్రచారం

జీవీఎంసీ 62వ వార్డులో ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఐదేళ్ల వైసీపీ సుపరిపాలనను అందించిందని, మళ్లీ జగన్ ప్రభుత్వం ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రజాసేవ అంటే ఆనంద్ కుమార్‌కు చాలా ఇష్టమని, అందువల్ల ఎమ్మెల్యేగా ఆయనను గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

89వ వార్డులో ఆనంద్‌కుమార్ సతీమణి..

గోపాలపట్నం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి దోహదపడాలని పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను,

ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శనీయంగా అభివృద్ధి చేస్తా

వైసీపీ 'పశ్చిమ' అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

నియోజకవర్గంలో ఆనంద్‌కుమార్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి గోపి, ఇన్‌చార్జి దొడ్డి కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, నాయకురాలు పేడాడ రమణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

'ఆడారి'ని కలిసిన నాయీబ్రాహ్మణులు

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని నాయీబ్రాహ్మణులు కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో వైసీపీ 'పశ్చిమ' అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను మర్రిపాలెంలోని పార్టీ కార్యాలయంలో కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నాయీబ్రాహ్మణులు ఉండాలని ఆకాంక్షించారు. నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఏ రెహమాన్, పేడాడ రమణకుమారిలు మాట్లాడుతూ ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

నేడు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, పంచకర్ల నామినేషన్

గాజువాక/వేపగుంట/మల్కాపురం, ఏప్రిల్ 23: తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ముందుగా ఇక్కడి కుంచుమాంబ గుడి నుంచి కొత్త గాజువాక వరకు, అక్కడి నుంచి సినిమా హాల్ జంక్షన్, పాత గాజువాక వంటిళ్లు, జగ్గు జంక్షన్ల మీదగా పల్లా శ్రీనివాసరావు భారీ ర్యాలీ చేపడతారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు కూడా బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. వందలాది మందితో ర్యాలీ చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే జనసేన పార్టీ 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా వేపగుంటలోని వరలక్ష్మీనగర్ కాపు సామాజిక భవనం నుంచి భారీ బైక్ ర్యాలీని తహసీల్దార్ కార్యాలయం వరకు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం :** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని(గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్ :** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి :** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 21, టమాటా 26, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 24, బెండకాయలు 26, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 24, క్యారెట్ 38, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 36, బరబాటి 30, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 86, ఆగాకర 72, పొటల్స్ 60, కీరదోస 24, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 40, కంద 60, దేముదు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 105
ఫారం ధర	-- 125
విత్ స్కిన్	-- 220
స్కిన్‌లెస్	-- 230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6లో..

విమాన్‌నగర్‌లో కాలువపై అక్రమ నిర్మాణాలు

ఐదు రోజులుగా చురుగ్గా సాగుతున్న పనులు

పట్టించుకోని అధికారులు



విమాన్‌నగర్‌లోని కాలువపై సాగుతున్న నిర్మాణ పనులు

ఎన్.ఎ.డి. జంక్షన్, ఏప్రిల్ 23: జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. విమాన్‌నగర్ సెక్టార్-7, 8 రహదారిని ఆనుకుని ఉన్న కాలువపై గత ఐదు రోజులుగా అక్రమ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడి కాలువకు ఆనుకుని ఉన్న గోడల ఎత్తు పెంచి సిమెంటు పలకలను ఏర్పాటు చేసి, షెడ్డులు నిర్మించి దుకాణాల కింద అద్దెకు ఇచ్చేందుకు స్థానిక నాయకులు యత్నిసున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులతో ఓ భవన నిర్మాణ యజమాని కుమ్మక్కై అక్రమ నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలుస్తుంది. ఇక్కడి కాలువపై సుమారు ఆరు నుంచి ఎనిమిది దుకాణాలను నిర్మించేందుకు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కాలువపై సిమెంటు బ్రిక్స్‌తో గోడలను ఎత్తు చేస్తున్నారు. దుకాణాల నిర్మాణం పూర్తయితే ఒక్కోదాన్ని రూ.రెండు లక్షలకు విక్రయించాలని ధర నిర్ణయించి స్థానికంగా వ్యాపారాలు చేస్తున్న పలువురితో ఒప్పందం కుదుర్చుకున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా కాలువపై అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండడాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు నిర్మాణ పనులను చకచకా సాగిస్తున్నారు. కాలువపై నిర్మాణాలు ఉంటే భవిష్యత్తులో వర్షాలు కురిసేటప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడం ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. అందువల్ల అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటులాంటి కర్మాగారాన్ని జగన్ నిర్మించగలరా?

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 23: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్ని జన్మలెత్తినా స్టీల్‌ప్లాంట్‌లాంటి మరో కర్మాగారాన్ని నిర్మించగలరా అని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,167వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించుకున్న నీరో చక్రవర్తిలా జగన్ వైఖరి ఉందని విమర్శించారు. నగరంలో బస్సు యాత్ర చేపట్టిన జగన్ కనీసం గాజువాక నియోజకవర్గానికి గానీ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చి కార్మికులు, నిర్వాసితుల ఇబ్బందుల గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీనినిబట్టే విశాఖ ఉక్కుపై జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఎన్నికల ముందే స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామని హామి ఇచ్చే పార్టీలకే ప్రజలు పట్టం కడతారన్నారు. కేంద్రానికి వత్తాసు పలికిన వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ఉక్కును ప్రైవేటీకరణ కాని వ్వబోమన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, రాజు, శ్రీనివాసనాయుడు, ఆనంద్, మొయిద్దీన్, జి.ఆనంద్, గంగవరం గోపి, విప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై అదానీ యాజమాన్యం కుట్ర

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 23: అదానీ యాజమాన్యం స్టీల్‌ప్లాంట్‌పై కుట్ర చేస్తుందని ఇంటక్ 'ఉక్కు' అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని, స్టీల్‌ప్లాంట్‌ను ఇబ్బందులకు గురి చేయాలనే లక్ష్యంతోనే కార్మికులతో సంప్రదింపులు జరపలేదని ఆరోపించారు. జిల్లా అధికార యంత్రాంగం కదలివచ్చినా పోర్టు యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కోల్ సమస్య కారణంగా కోకోఓవెన్ బ్యాటరీ ఒకసారి మూసివేస్తే మళ్లీ ప్రారంభించే అవకాశం ఉండదన్నారు. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు నాయుడు, ప్రభాకరరెడ్డి, ప్రసాద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం.. అంబేడ్కర్ రాజ్యాంగం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 24: ప్రపంచం మరువలేని పేరు ఒక్క అంబేడ్కర్ మాత్రమేనని స్టీల్‌ప్లాంట్ జీఎం (మిల్స్) యు.శ్రీనివాస ప్రసాద్ అన్నారు. ప్లాంట్‌లోని ఎస్‌టీఎం విభాగంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా ప్రతిఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎం విభాగాధిపతి సంజయ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, విభాగం అధ్యక్షుడు ఎ.రవికుమార్, అధికారులు కిరణ్‌కుమార్, రోయ్, శేషు, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలకు 25 మంది విద్యార్థులు ఎంపిక

పెందుర్తి, ఏప్రిల్ 23: పినగాడిలోని విస్టం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కాలేజీలో వివిధ బ్రాంచిల్లో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న 25 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాలకు ఎంపికయ్యారు. టెక్ టామ్మినియా కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు.

గాజువాకలో రెండు నామినేషన్లు

గాజువాక, ఏప్రిల్ 23: గాజువాక నియోజకవర్గంలో మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. గాజువాక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈఆర్వో డి.లక్ష్మారెడ్డి నామినేషన్లు స్వీకరించారు. సీపీఎం నుంచి ఎం.రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా ఎస్.శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు నియోజకవర్గంలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి.

పెందుర్తిలో ఒకటి..

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ఒక నామినేషన్ స్వీకరించినట్టు ఈఆర్వో శేషశైలజ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు అందజేసిన నామినేషన్‌తో మొత్తం వీటి సంఖ్య 14కు చేరిందని ఆమె పేర్కొన్నారు.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 23: నాతయ్యపాలెంలోని పలు ఆలయాలకు ధర్మకర్తగా వ్యవహరిస్తున్న గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జనసేన గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గోపిశెట్టి శ్రీను, సంద్రాన సన్యాసిరావు, ఎస్.శ్రీనివాస్, తదితరులు మాట్లాడుతూ టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం వెంకటరావు, తిప్పల రమణారెడ్డి, జి.అప్పారావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఏప్రిల్ 23: అగనంపూడి సిగ్నల్ జంక్షన్ వద్దనున్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మహావీర్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం లారీ ఓనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుల్ల తాతారావు, మజ్జి శ్రీను, బి.సత్యనారాయణ, విందులు వరలహాలు, సత్యారావు, ఎస్.రమణ, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొర్రమాంబ జాతర



అగనంపూడి, ఏప్రిల్ 23: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచే అమ్మవారి దర్శనాలను ప్రారంభించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుకుంకుమలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పాతఅగనంపూడి నుంచి నిర్వాసిత గ్రామాల మీదగా ఊరేగించాక ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రతేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారి అనుపోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, స్థానిక నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, చిత్తా కనకరాజు, కె.సత్యారావు, ఎం.నరసింగరావు, గల్లా రాజు, ఎం.శ్రీను, గుర్రం శ్రీను, సమర, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

అగనంపూడి, ఏప్రిల్ 23: భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన డొంకాడ దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి దాసరి త్రినాథరావు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోడి ఘటాల వేడుక, కోటి దీపారాధన నిర్వహిస్తామన్నారు. 25న అమ్మవారి అనుపోత్సవాన్ని బాణసంచా కాల్పులు, బండ్ల వేషాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బొబ్బరి అప్పారావు, దాసరి సన్యాసిరావు, కరణం శ్రీను, ఎ.అప్పారావు, బి.సత్తిబాబు, డి.నాయుడు, పెంటారావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



కూర్మన్నపాలెం, ఏప్రిల్ 23: ఏడుకొండలవాడా.. వేంకటరమణా.. గోవిందా.. గోవింద.. నామస్మరణతో 87వ వార్డు రాజులపాలెం కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం మార్మోగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు కోగంటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తీర్థ గోష్ఠి, మహా పూర్ణాహుతి, అర్చన, హోమాలు నిర్వహించారు. టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. మహిళలు అన్నమాచార్యుని భక్తి గీతాలను ఆలపించారు. టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, శ్రీనివాస వర్మ, బాబూరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు అశోక్‌రాజు, సుబ్బరాజు, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

బండిమాంబ వార్షికోత్సవాలు ప్రారంభం

పెందుర్తి-రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని చింతలఅగ్రహారం ప్రజల ఆరాధ్య దేవత బండిమాంబ వార్షికోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గవరపాలెం కాలనీలోని ఉత్సవ మూలవిరాట్టు భూలోకమాతకు పసుపుకుంకుమలు సమర్పించారు. ఈ నెల 28న ప్రధాన పండుగ సందర్భంగా అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిదులు తెలిపారు.


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న వంశీకృష్ణ


ప్రచారంలో వంశీకృష్ణ సతీమణి పద్మజ

జనసేనలో మహిళలు, యువకులు చేరిక

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. జీవీఎంసీ పరిధి 39వ వార్డుకు చెందిన మహిళలు, యువత జనసేన పార్టీలోకి మంగళవారం చేరారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని కృష్ణాగార్డెన్స్‌లోని రాజుగౌడ్, పరదేశి ఆధ్వర్యంలో పలువురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వంశీకృష్ణ శ్రీనివాస్ వీరందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమకు నియోజక వరిధిలో ప్రజలనుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. అనేక వర్గాలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారన్నారు. దీనిని బట్టీ జనసేన, టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు గెలుపుకు అనుకూల వాతావరణం కనిపిస్తోంది. కూటమి శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి కూటమి చేయనున్న అభివృద్ధిని వివరించాలనికోరారు. నియోజవర్గ సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని ఈసందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరదేశమ్మ, పరమేశ్వరి, రాజేశ్వరీ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ పరిసరాల్లో వంశీకృష్ణ సతీమణి ప్రచారం..

జీవీఎంసీ పరిధి 27వ వార్డు శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లోని దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ సతీమణి పద్మజ ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా వంశీకృష్ణకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


సంప్రదాయ వస్త్రధారణలో విష్ణుకుమార్‌రాజు, శ్రీభరత్ తదితర నేతలు


నామినేషన్ల కోసం వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు

న్యాయానికి, రౌడీయిజానికి మధ్య పోటీ

- ఔచిత్యంతో ఓటువేయాలని ఉత్తర బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అభ్యర్థన
- అట్టహాసంగా నామినేషన్ దాఖలు

సీతమ్మధార/ మురళీనగర్ ఏప్రిల్ 23: నీతి, నిజాయితీకి, రౌడీయిజానికి మధ్య ప్రస్తుత ఎన్నికల్లో పోటీ జరుగుందని, ప్రజలు ఔచిత్యంతో ఆలోచించి ఓటు వేయాలని ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. విష్ణుకుమార్‌రాజు మంగళవారం నామినేషన్ వేశారు. నేతలు సంస్కృతి, సంప్రదాయాల తెలిపేలా లుంగికట్టు, తల పాగాతో భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులతో కలిసి సీతమ్మధారలో బీజేపీ కార్యాలయం నుంచి కూటమి అభిమానులు, నాయకులు పాద యాత్రగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన ఇన్ చార్జి పసపులేటి ఉషాకిరణ్, డాక్టర్ రఘు, విష్ణుకుమార్ రాజు కుమార్తె శ్యామల దీపిక, బీజేపీ నేతలు పరశురామ్, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యాలయంలో ఆర్వోకు నామినేషన్ ప్రతాలుఅందజేశారు. అనంతరం బయటకు వచ్చిన విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ తన నామినేషన్‌కు వచ్చిన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నీతినిజాయితీ, ధర్మం కోసం తాను పోటీ చేస్తుంటే.. రౌడీయిజంతో నిబంధనలను ఉల్లఘించి వైసీపీ అభ్యర్థిగా కేకే రాజు రాజు తలపడుతున్నారని అన్నారు. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. శ్రీభరత్ మాట్లాడుతూ ఉన్నత వ్యక్తిత్వంతో ప్రజలమన్ననలందుకుంటున్న విష్ణుకుమార్‌రాజు భారీ మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. అనంతరం అల్లూరి సీతారామారాజు విగ్రహానికి నివాళులర్పించారు. మాధవధారలో టీడీపీ నేతలు సనపల.కీర్తి, సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా నామినేషన్లకు వచ్చారు. 25వ వార్డు అధ్యక్షుడు నమ్మి రవికుమార్, నాయకులు ఈ తలపాక సుజాత, ఇసరపు వాసు, బర్ల పద్మలత, బొడ్డేటి మోహన్, బీజేపీ ఉత్తర ఇన్ చార్జి సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ వేషధారణ, సాముగరిడీల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య


విద్యార్థులను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాప్రమాణాలు ఉంటాయని ఆర్‌బీఎం యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్.ప్రభాకర్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962లో పాఠశాల ప్రారంభమైన తరువాత 2006 నుంచి ప్రాథమికోన్నత పాఠశాలగా మారిందన్నారు. ఈ క్రమంలో ఇక్కడ చదువుకున్న ఎంతోమందిఉన్నతస్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఎంఈవో-1 మహారాణిపేట పైడపునాయుడు, ఎంఈవో- 2 బి.పుష్పరాగం, ఎంఈవో -1 సీతమ్మధార డి.రామారావులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కనకరావు, కె.రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్: ఎస్ఐ


ఎల్ఈడీ స్క్రీన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వాణిశ్రీ

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 23: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టడానికి వీలువుతుందని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి.వాణిశ్రీ వాహనచోదకులకు సూచించారు. రైల్వేన్యూకాలనీలో మంగళవారం సాయంత్రం సుప్ర వాహనంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల వీడియోలను చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతమ్మధార, ఏప్రిల్ 23: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని శ్రీ కృష్ణ మదిరం వద్ద గల వేద సంరక్షణ సభా ప్రాంగణంలో వైదిక విజ్ఞాన విపంచి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి ; డీటీసీ

మురళీనగర్, ఏప్రిల్ 23; ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతల నేపథ్యంలో వాహనాల డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జి.సి.రాజారత్నం సూచించారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్లు అధికంగా నీరు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే డ్రైవింగ్ చేయకుండా తగిన వైద్య పరీక్షలు చేయించుకుని సేద తీరాలన్నారు. హెవీ వెహికల్స్ టైర్లలో పరిమితికి మించి గాలి నింపకూడదన్నారు.

'పది' ఫలితాల్లో 'విద్యోదయ' విద్యార్థులు ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భగీరథ

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: నిరంతర సాధనతో ఫలితాలు సాధించవచ్చునని తమ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాలు నిరూపించాయని డాబాగార్డెన్స్‌లోని విద్యోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ భగీరథ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు సాధించిన విద్యార్థులను హై స్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు తమ విద్యార్థులు 291 మంది హాజరై శత శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. వీరిలో వాసుపల్లి తేజ 592 ప్రథమ స్థానం, ఆదిత్య శర్మ, మహమ్మద్ అర్ష్ 591, వి.వైష్ణవి 590, మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారన్నారు. 580 మార్కులకుపైగా 21 మంది విద్యార్థులు, 570 మార్కులకుపైగా 39 మంది, 560 మార్కులకుపైగా 52 మంది, 550 మార్కులకు పైగా 76 మంది, 152 మంది 500 మార్కులకు పైగాసాధించారన్నారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు.

ఓటర్ల చైతన్యంపై అవగాహన



మాట్లాడుతున్న సీబీసీ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌదరి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 23: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీబీసీ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్రచౌదరి హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో అంతా భాగస్వామ్యం కావాలన్నారు. అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.రామారావు, సీబీసీ సహాయ సంచాలకులు షఫీ మహమ్మద్ మాట్లాడుతూ దేశంలో ఓటింగ్ శాతం పెరగడానికి యువత భాగస్వామ్యం ఎంతో అవసరమనానరు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, స్వీప్ అధికారులు పుష్పరాజం, పోలినాయుడు, విశాఖ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బాలకృష్ణ, విద్యార్థుల పాల్గొన్నారు.

28న గౌడ ఎడ్యుకేషన్ అవార్డులు ప్రదానం

మహారాణిపేట, ఏప్రిల్ 23: గౌడ సామాజిక సంక్షేమ సంఘం ద్వారా ఈనెల 28న గౌడ ఎడ్యుకేషన్ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు విశాఖ జిల్లా సం ఘం అధ్యక్షుడు మార్గన రామారావు తెలిపారు మం గళవారం మహారాణిపేటలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28 వ తేదీన ఈ కార్యాలయంలో ఎడ్యుకేషన్ అవార్డులతోపాటు గౌడ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. సంఘంలోని కుటుంబలు తమ పిల్లల ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు ఈ నెల 26వ తేదీలోగా అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కామన వెంకట సుబ్బారావు నారాయణ, జెర్రిపోతుల ప్రసాద్, అత్తిలి శంకరరావు, మేరువ గణేష్, మట్టా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ రోడ్‌షో వెలవెల

... 3వ పేజీ తరువాయి

స్టేడియం దాటేసరికి ఒక్కరు కూడా రోడ్డు మీద లేకపోవడంతో జగన్ బస్సుపై నుంచి దిగి లోపల కూర్చున్నారు. అక్కడి నుంచి రోడ్డుపక్కన నిలబడి చూస్తున్న వారికి నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం, బోయిపాలెం జంక్షన్ల వద్ద కొద్ది సంఖ్యలో మాత్రమే జనం కనిపించడంతో వారికి బస్సులో నుంచే జగన్ నమస్కారం చేశారు. ఆనందపురం జంక్షన్‌లో కూడా పెద్దగా జనం లేరు. పూలమార్కెట్ వద్ద కొంతమంది ఉండడంతో సీఎం జగన్ మళ్లీ బస్సుపైకి వారికి నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లి తర్వాత బస్సులోకి వెళ్లి కూర్చుండిపోయారు. అనంతరం అక్కడకు కొద్దిదూరంలో ఉన్న చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్లతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత విజయనగరం బయలుదేరి వెళ్లారు.

కోడ్ ఉన్నా ఏయూలో అచీవర్స్‌డే!

... 3వ పేజీ తరువాయి

అమల్లో ఉండగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా..కార్యక్రమం నిర్వహణకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఇచ్చారని బదులిచ్చారు. విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందిం చడంతోపాటు తల్లిదండ్రులను సత్కరిస్తామని వివరించారు.

వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకే...

వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకే ఏయూ అధికారులు ఇంత పెద్దఎత్తున కార్యక్రమం చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేవనే నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఇటువంటి తరుణంలో ఏయూ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని వైసీపీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, కొందరు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహంపై ఈ కార్యక్రమంలో మాట్లాడించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారంటున్నారు.

రూ.1.3 కోట్లకు సైబర్ నేరగాళ్లు టోకరా

... 3వ పేజీ తరువాయి

జరిగిందని, మీ అకౌంట్స్ నుంచి తీవ్రవాదులకు (తుపాకుల కొనుగోలు నిమిత్తం) డబ్బులు అందాయని చెబుతూనే, ప్రస్తుతం మీ అకౌంట్‌లో ఉన్న డబ్బును మాకు ట్రాన్స్‌ఫర్ చేస్తే, ఆర్బీఐ నిబంధనల ప్రకారం ఖాతాను చెక్ చేసి, తిరిగి అకౌంట్‌లో జమ చేస్తామని నమ్మబలికారు. దీనికితోడు ఆర్బీఐకి సంబంధించిన లెటర్‌ని బాధితునికి ఆన్‌లైన్‌లో పంపించాడు. బాధితుడు వారు చెప్పినట్టే తన ఖాతాలోని రూ.1,30,30,639 నగదును వారి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే దీనిపై అనుమానం వచ్చి వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో సైబర్ క్రైం జోన్-2 సీఐ జి.శ్రీనివాసరావు బృందం వివరాలు సేకరించి, పోగొట్టుకున్న నగదులో రూ.85,70,923 మొత్తాన్ని హోల్డ్ చేయగలిగారు.

పునాదుల్లోనే జగనన్న ఇళ్లు

... 3వ పేజీ తరువాయి

మధురవాడ తదితర ప్రాంతాలకు చెందిన 9,717 మందికి సెంటు చొప్పున కేటాయించారు.

ఈ మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి 2022 ఏప్రిల్ 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. అదే వేదిక మీద లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఏడాదిలోగా లబ్ధిదారులకు సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఈ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం పనులు రాక్రీట్ ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. అయితే రెండేళ్లుగా నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు వెయ్యి ఇళ్లు స్లాబ్ దశను దాటి ప్లాస్టింగ్ పనులు జరుగుతుండగా, సుమారు వెయ్యి ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయి. మిగిలిన ఏడు వేల ఇళ్లు ఇంకా పునాదుల్లోనే ఉన్నాయి. మండలంలోని మిగతా లేఅవుట్లలో కూడా నత్తనడకన ఇళ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. బిల్లులు మంజూరు కాకపోవడం వల్లనే ఇళ్ల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతుందని అక్కడ పని చేసే సిబ్బంది చెబుతున్నారు.

పరిహారం ప్లాట్లు అభివృద్ధి అంతంత మాత్రమే..

భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద ఇచ్చే ప్లాట్లు సకల సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తామని సీఎం అదే సభలో చెప్పారు. పరిహారం (ఆర్‌సీ) ప్లాట్లు రైతులకు అప్పగించిన తరువాతే ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ పరిహారం ప్లాట్ల అభివృద్ధి పనులు సాగుతూ....నే ఉన్నాయి. అది కూడా రైతులు పలుమార్లు నిరసన వ్యక్తం చేసి, అనకాపల్లి కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఇటీవల పరిహారం ప్లాట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

కాలనీపైకి వరద

ఇదిలావుండగా పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీకి ఎగువనున్న కొండల పైనుంచి వచ్చే వరద నీరు పోయేందుకు మార్గం ఏర్పాటుచేయకుండా వీఎంఆర్‌డీఏ అధికారులు లేఅవుట్ వేసేశారు. దీంతో భారీవర్షాలు కురిసినప్పుడల్లా లేఅవుట్ ముంపునకు గురవుతోంది. ఈ నీరు రైతులకు పరిహారం కింద ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్లను ముంచెత్తడంతో వారు గగ్గోలు పెట్టారు. కొంతమంది రైతులకు ఆర్‌సీ ప్లాట్లు గెడ్డలో ఇచ్చారు. ఇదే గెడ్డలోకి ఎగువన ఉన్న తుమ్మల చెరువు మిగులు నీరు కూడా వచ్చి ప్లాట్లను ముంచెత్తేది. దీనిపై రైతులంతా అనేకసార్లు నిరసనలు వ్యక్తం చేయడంపాటు అనకాపల్లి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో తుమ్మల చెరువు నుంచి మిగులు నీరు పోయేందుకు సీసీ కాలువ నిర్మిస్తామని రైతులకు వీఎంఆర్‌డీఏ అధికారులు హామీ ఇచ్చారు. అలాగే కొండల పైనుంచి వరద నీరు లేఅవుట్‌లోకి రాకుండా ఆ వాలులో ట్రెంచ్‌లు ఏర్పాటుచేసి, ఆ నీటిని చెరువులకు మళ్లిస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పారు.

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి...

... 3వ పేజీ తరువాయి

సింగపూర్ తరహాలో విశాఖ అభివృద్ధే లక్ష్యం

మనం, మన ప్రాంతం అభివృద్ధి కోసం పెద్ద స్థాయిలో లక్ష్యాలు పెట్టుకుని వాటి సాధనకు కృషిచేయాలి. పెద్ద కలలు కని వాటి సాధనకు యత్నించాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అనేవారు. అదే మాదిరిగా భారీ లక్ష్యాలను నిర్దయించుకుని వాటిని సాధించిన దీరోదాత్తుడు లీకూన్. ఆయన సారథ్యంలో సింగపూర్ అభివృద్ధి చెందింది. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని విశాఖను అభివృద్ధి చేయాలన్నదే నా ఆలోచన, ఆశయం. సింగపూర్‌లా విశాఖలో ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వసతుల కల్పన, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నదే నా ఆశయం. ఇంకా సింగపూర్ మాదిరిగా ఆర్థిక నగరంగా మార్చినప్పుడే ప్రపంచంలో విశాఖ పేరు మార్మోమోగుతుంది.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం. ఇలాగే 2002లో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొని బీఐఎఫ్ఆర్‌కు వెళ్లినప్పుడు నాడు సీఎం చంద్రబాబునాయుడు చొరవతో ఎంపీలు ఎంవీవీఎస్ మూర్తి, కింజరాపు ఎర్రన్నాయుడు తదితరులు అప్పటి ప్రధాని వాజపేయి వద్దకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. ఆ తరువాత కర్మాగారం శరవేగంగా ఏడు మిలియన్ టన్నుల ఉత్పత్తి స్థాయికి చేరుకుని దేశానికే తలమానికంగా మారింది. ఇప్పుడు కూడా కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే ఉండాలంటే సెయిల్‌లో విలీనం చేయాలి. అప్పుడే సొంత గనులు దక్కుతాయి. ఈ ప్రక్రియ కూటమి ప్రభుత్వానికి సాధ్యమవుతుంది. మూడేళ్లుగా ఉక్కు కార్మికులు ఆందోళన చేస్తున్నా కార్మిక సంఘాలు, విపక్ష పార్టీల నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానిని కలిసి సమస్య పరిష్కారానికి చొరవ చూపడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటుకు యత్నిస్తాం

ఉత్తరాంధ్రకు గేట్‌వేగా ఉండే విశాఖలో చాలాకాలం క్రితం భారీ పరిశ్రమలు వచ్చాయి. తరువాత ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలు రాకపోవడం వాస్తవమే. దీనిపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో ఎటువంటి పరిశ్రమలు అనువుగా ఉంటాయో ఆలోచించి ప్రణాళికలు వేసి అమలుచేయాలి. ఇప్పటికే ఉన్న భారీ పరిశ్రమల విస్తరణ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తాను. ముఖ్యంగా ఫార్మా, మత్స్య సంపద ఎగుమతి విషయంలో దృష్టిసారిస్తే వ్యాపార అవకాశాలు పెరిగి ఉపాధి దొరికి నగరం అభివృద్ధి చెందుతుంది.

ఐటీ కంపెనీల రాకకు కృషి

విశాఖకు ఇప్పటివరకు ఐటీలో చిన్న కంపెనీలు, బీపీవో సర్వీసులు అందించే సంస్థలే వచ్చాయి. పెద్ద కంపెనీలు హైదరాబాద్‌కు పరిమితమయ్యాయి. పెద్ద కంపెనీలను తీసుకురావడంలో గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చంద్రబాబునాయుడు హయాంలో విశాఖకు ఫ్రాంక్లిన్ టెంపుల్ కంపెనీ వచ్చింది. కొద్దిరోజుల్లో కంపెనీ ఏర్పాటవుతుందనగా ప్రభుత్వం మారడంతో ఆ కంపెనీ వెనక్కి వెళ్లిపోయింది. అలాగే అదానీ డేటా సెంటర్‌కు చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...అన్ని రకాలుగా అడ్డుకుంది. అదే డేటా సెంటర్‌కు ఏడాది క్రితం మళ్లీ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇంకా స్టార్టప్‌లు, ఐటీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇతరత్రా రంగాలకు ముడిపడి ఉన్న కంపెనీలు రావాలంటే వాటిలో పనిచేసేందుకు నిపుణులు లభ్యత ముఖ్యం. అటువంటి నిపుణులు స్థానికంగా రావాలంటే ఇక్కడ ప్రముఖ విద్యా సంస్థలతో ఐటీ కంపెనీలు ఒప్పందాలు చేసుకునివిద్యార్థులను తీర్చిదిద్దాలి. ఉత్తరాంధ్రలో వేలాది మంది యువత ఉపాధితోపాటు శిక్షణకు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. అటువంటి యువతను విశాఖలో శిక్షణ ఇచ్చి ఇక్కడే ఉపాధి కల్పిస్తే పెద్ద కంపెనీలు వస్తాయి. ఇందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి. అటువంటి కృషి చంద్రబాబునాయుడు మాత్రమే చేయగలరు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రముఖ కంపెనీలను విశాఖకు రప్పించేందుకు ప్రయత్నం చేస్తాం.

పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం పునరుద్ధరణ

గత ఐదేళ్లలో విశాఖతోపాటు రాష్ట్రంలో పరిశ్రమల నిర్వహణ, విస్తరణ, ఏర్పాటుకు అనువైన వాతావరణం పూర్తిగా పోయింది. చివరకు పరిశ్రమల విస్తరణ చేద్దామన్నా అనేక ఇబ్బందులు సృష్టించారు. ఒక విధంగా చెప్పాలంటే పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం చెడగొట్టారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్సాహంతో ఉన్నా...ఇక్కడ వాతావరణంతో వారంతా మౌనంగా ఉండడం లేదా ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం జరిగింది. మంచి ప్రభుత్వం వస్తే ఇక్కడకు వచ్చేందుకు అనేకమంది వ్యాపారులు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికగా శాంతిభద్రతల సమస్యను పరిష్కరించి సమర్థులైన అధికారులకు బాధ్యతలు అప్పగించే ప్రయత్నం చేస్తాం.

నగర కాలుష్యాన్ని అరికట్టాల్సిందే

విశాఖ నగరంలో లక్షల జనాభా నివసిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంగా ఉండాలంటే నగరం పరిశుభ్రంగా ఉండాలి. అయితే విశాఖ పోర్టు నుంచి వచ్చే కాలుష్యం నగర ప్రజల్ని ఉక్కిరిబిక్కిరిచేస్తుంది. ముఖ్యంగా పోర్టులో దిగుమతి అయ్యే బొగ్గు వల్లే కాలుష్యం వస్తోంది. పోర్టు యాజమాన్యం నివారణ చర్యలు తీసుకున్నా ఫలితం ఉండడం లేదు. కాలుష్యం పోవాలంటే బొగ్గు దిగుమతి నిలిపివేసి మరో పోర్టుకు తరలించాలి. పోర్టులో కేవలం కార్గో రవాణాకు మాత్రమే అనుమతించాలి. దీనిపై కేంద్రస్థాయిలో నిర్ణయం తీసుకునేలా కృషిచేస్తాను. బొగ్గు దిగుమతి నిలిపివేస్తే తప్ప వన్‌టౌన్ ప్రాంతాన్ని రక్షించడం కష్టం. ఈ విషయంలో ప్రజలు, పౌర సంఘాల సూచనలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాను.

పర్యాటకంగా అనేక విభాగాల అభివృద్ధి

పర్యాటకం అనగా గుర్తుకొచ్చే నగరం విశాఖ. అయితే విశాఖలో బీచ్ టూరిజం విస్తరణకు కొన్ని పరిమితులు ఉన్నాయి. ఇక్కడ కెరటాలు ఉధృతి ఎక్కువగా ఉండడం, లోతు సమస్యలుగా ఉన్నాయి. అందువల్ల బీచ్‌లో క్రీడలు వంటి వాటిని ప్రోత్సహించాలి. ఏజెన్సీలో పర్యాటకం కోసం మౌలిక వసతులు కల్పించాలి. విశాఖ ప్రాంతంలో బౌద్ధమత పర్యాటక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించవచ్చు. అంతర్జాతీయ పర్యాటకులను విశాఖకు రప్పించేలా ప్రాజెక్టులు తీసుకువస్తే పెద్దఎత్తున ఉపాధి దొరుకుతుంది. అందుకు కృషివస్తా.

గంజాయి, మత్తు పదార్థాల అరికడతాం

గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, ఇతర ప్రాంతాలకు రవాణా ఆందోళన కలిగిస్తోంది. లక్షల మంది యువత నిర్వీర్యం కావడం...అటు సమాజానికి ఇటు కుటుంబాలకు తీవ్ర ఆవేదన, ఆందోళన కలిగిస్తోంది. ఏజెన్సీ నుంచి గంజాయి రవాణా విషయంలో ప్రభుత్వ వైఫల్యం ఉంది. ప్రపంచంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు విశాఖలో ఉన్నట్టు తేలుతుంది. ఇది సిగ్గుచేటైనా అంశం. ఇంకా డ్రగ్స్ దిగుమతి కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చెప్పాలి. విశాఖకు వేల టన్నుల మత్తు పదార్థాలు దిగుమతి అవుతున్నాయని కేంద్రానికి సమాచారం రావడంతో సీబీఐ రంగంలోకి దిగింది. ఇది కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కేసు దర్యాప్తునకు అధికారులు అడ్డుతగిలారని సీబీఐ కూడా పేర్కొంది. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, రవాణాపై ఉక్కుపాదం మోపాలి. అది ఈ ప్రభుత్వానికి సాధ్యంకాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని అరికడతాం. అందుకు కేంద్ర సాయం కోసం యత్నిస్తాను.

ప్రజాసేవలోనే ఎక్కువ ఆనందం

2019లో ఎంపీగా పోటీ చేసే సమయానికి రాజకీయంగా అనుభవం తక్కువ. అప్పట్లో త్రిముఖ పోటీ ఉండడంతో స్వల్ప తేడాతో ఓడిపోయా. గడచిన ఐదేళ్లలో ఒకపక్క ప్రజలకు అందుబాటులో ఉంటూ, మరోపక్క పార్టీ నాయకులు, కేడర్‌ను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నాను. గ్రామాలు, నగరంలోని మురికివాడలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నా. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు మరింతగా సేవ చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చాను. తాతలు ఎంవీవీఎస్ మూర్తి, కావూరి సాంబశివరావుల నుంచి రాజకీయాలకు సంబంధించి అనేక విషయాలు నేర్చుకున్నా. సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాను తప్ప డబ్బు సంపాదించుకునేందుకు కాదు. యూనివర్సిటీ చైర్మన్‌గా ఉన్న నేను అక్కడే ఎక్కువ సమయం కేటాయిస్తే మరింత సంపాదించుకోవచ్చు. కానీ రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు సేవ చేయడంలో ఎక్కువ ఆనందం, తృప్తి ఉంటాయి.

నగరంలో ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలి

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది గొప్ప ఆయుధం. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలి. గ్రామీణ ప్రాంతంలో 70 శాతం దాటి ఓటింగ్ జరుగుతుంది. నగరంలో మాత్రం 2019లో 67 శాతానికి పరిమితమైంది. ఈసారి నగరంలో ప్రతి ఒక్కరూ ఓటువేసి 75 శాతం ఓటింగ్ జరిగేలా సహకరించాలి. విశాఖ పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతుంది. ప్రతిచోట ప్రజల నుంచి విశేషమైన మద్దతు లభిస్తోంది. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంటు పరిధిలో ఓటర్లంతా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలి. అప్పుడే అంతా కోరుకునే సుందర విశాఖ స్వప్నం కల సాకారం అవుతుంది.

పొట్టకూటికి వచ్చి ప్రాణాలు కోల్పోయారు

... 3వ పేజీ తరువాయి

తమకు తెలిసిన యువకుడి ద్విచక్ర వాహనాన్ని తీసుకుని పోలీసు బ్యారెక్స్ వైపు నుంచి జీవీఎంసీ జోన్- 4 కార్యాలయం వైపు వస్తున్నారు. ఈ క్రమంలో లీలామహల్ థియేటర్ వైపు నుంచి జగదాంబ జంక్షన్ వైపు వస్తున్న 108 అంబులెన్స్‌ను బలంగా ఢీ కొన్నారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అయినా, పరిస్థితి విషమించి ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆసుపత్రిలో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నామినేషన్ల కోలాహలం

... 3వ పేజీ తరువాయి

విష్ణుకుమార్‌రాజు రెండు సెట్లు, పెనుమత్స శ్యామలా దీపిక రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇంకా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వీవీఎస్ కమలాకర్‌రావు ఒక సెట్, రామారావు లక్కరాజు రెండు సెట్లు, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ తరపున పెద్దాడ కనకమహాలక్ష్మి ఒక సెట్ దాఖలు చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి సమాజ్‌వాదీ పార్టీ నుంచి రవికుమార్ వెలగాడ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, స్వతంత్ర అభ్యర్థిగా మందపాటి శ్రీనివాసరాజు, గాజువాక నియోజక వర్గానికి సీపీఐ (ఎం) నుంచి మైలవరపు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థిగా సీమకుర్తి శ్రీనివాసరావు అలియాస్ భగవాన్ శ్రీను, పెందుర్తికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్ రెండు సెట్లు నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా పొన్నాడ అప్పలనాయుడు ఒక సెట్ నామినేషన్ సమర్పించారు. కాగా, బుధవారం గాజువాకలో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పెతకంశెట్టి గణబాబు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

భీమిలిలో రెండు నామినేషన్లు

భీమునిపట్నం, ఏప్రిల్ 23 : భీమిలి అసెంబ్లీ స్థానానికి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. సింహాచలం ప్రాంతానికి చెందిన చొప్పళ్లి శరవన్ గణేష్, ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన బావిశెట్టి రమణబాబు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారని చెప్పారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ముగిసిన చిన పోలమాంబ జాతర

ఆరిలోవ, ఏప్రిల్ 23 : ఆరిలోవలోని సంజయ్‌గాంధీ కాలనీలో వారం రోజులుగా జరుగుతున్న చిన పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారంతో ముగిసింది. పెదగదిలి, చినగదిలి, సంజయ్‌గాంధీ కాలనీవాసులు, ఆరిలోవ ఆఖరి బస్టాపు, సూర్యతేజనగర్ ప్రాంతాలకు చెందిన భక్తులు వేకువజాము నుంచి ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి పూజలు, అభిషేకాలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అనుపు ఉత్సవం నిర్వహించారు. అంతకముందు అమ్మవారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్ని గుండాన్ని భక్తులు తొక్కారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు నగేష్ శర్మ, ప్రభాస్, ఆలయ ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు, ఒమ్మి రాజు, కార్యదర్శి కెర్రు తాతాజీరావు, చీపురుపల్లి ఈశ్వరరావు, ఒమ్మి అప్పలరాజు, పోలారావు, గాడి సత్యం పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులతో సునీల్ మహంతి

ఆరిలోవ, ఏప్రిల్ 23 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంతఊటలు రవీంద్రబాబు, అనురాధ మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ శ్రద్ధ చూపాలన్నారు.ఇంటర్‌లో కూడా మంచి మార్కులు సాధించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గా భవానీ, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది : మాలతాంబా విద్యానికేతన్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినట్టు కరస్పాండెంట్ సునీల్ మహంతి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పి. చరణ్య సత్య 586, ఎన్. హాసిని 581, ఆర్. కీర్తన 576 మార్కులు సాధించగా 500కి పైగా మార్కులు సాధించిన వారు 50 శాతం మంది ఉన్నారని తెలిపారు.

ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

వెంకోజీపాలెం, ఏప్రిల్ 23 : యువత పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలని డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం లైబ్రేరియన్ ఆచార్య పి. వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకుని ఏయూ గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్, రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాలకు ఆయన పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకం పఠనం వల్ల లభించే జ్ఞానం వ్యక్తి వికాసానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలోనూ ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి డైట్ లెక్చరర్ ఎస్. త్రినాథరావు మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవులను వృథా చేయకుండా పుస్తక పఠనంపై ఆసక్తి చూపించాలన్నారు. అనంతరం విద్యార్థులు సెలవుల్లో చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 23 : కొత్త వెంకోజీపాలెంలోని కోదండ రామ సహిత వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలో ఉన్న శ్రీవల్లి దేవసేన నాగదేవత ఆలయంలోనూ భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాల భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

సినిమా గైడ్

- **పారిజాత పర్వం :** సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), దుర్గ (మధురవాడ)
- **టెనెంట్ :** శారద, విశేష్ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** మెలోడి, గోకుల్, శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి),
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, కిన్నెర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మార్కెట్ మహాలక్ష్మి :** శ్రీలీలామహల్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 28, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 26, క్యాబేజ్ 24, క్యారెట్ 38, దొండకాయలు 30, బంగాళా దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 148, బరబటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 28, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, ఆగాకర 72, పొటల్స్ 64, కీరదోస 24, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 60, దేముడు చిక్కుడు 50, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 6 లో..



గంటా శ్రీనివాసరావు, శ్రీభరత్‌పై పూల వర్షం కురిపించిన కార్యకర్తలు, పక్కన కోరాడ రాజబాబు



బక్కన్నపాలెంలో గజమాలతో స్వాగతం



డ్రైవర్స్ కాలనీలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గంటా

అభివృద్ధి మరచి.. వైసీపీ అరాచక పాలన

- ధ్వజమెత్తిన కూటమి
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీభరత్, గంటా
- ఆరో వార్డులో ఎన్నికల ప్రచారం

కొమ్మాది, ఏప్రిల్ 23 : అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని భీమిలి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆరో వార్డులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో వారు మాట్లాడారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం రేవళ్లపాలెంలో రోడ్డు విస్తరణ కోసం ఇళ్లు కూల్చి వేసి బాధితులకు ఇంతవరకు టీడీఆర్ అందించలేదని విమర్శించారు. ఎనిమిది నెలలుగా కనీసం ఇళ్లు కూల్చి వేసిన డెబ్రిస్‌ను అక్కడి నుంచి తరలించలేకపోయారని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వం మనకు అవసరమా అని ప్రజలను ప్రశ్నించగా మనకొద్దు అంటూ నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా, మధురవాడ ప్రాంతాన్ని జగన్ ప్రభు త్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం మధురవాడను పూర్తిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రేవళ్లపాలెంలో భూలోకమాత అమ్మవారిని ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌తో కలిసి గంటా దర్శించుకున్నారు. అక్కడి నుంచి బక్కన్నపాలెంలో ప్రచారానికి వెళ్లగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు పట్టి తిలకం రాశారు. గ్రామస్తులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఆపేస్తారంటూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ రూ. 4 వేల అందిస్తామని, అమ్మఒడి పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ. 15 వేలు ఇస్తామని తెలిపారు. మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు అందిస్తామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపై చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలన్నారు. కాగా డ్రైవర్స్ కాలనీ షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవానికి గంటా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సాయినాథుడికి పూజలు నిర్వహించి, అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, మన్యాల సోంబాబు, నమ్మి శ్రీను, ఇ.ఎన్.ఎస్ చంద్రరావు, దాసరి శ్రీనివాస్, పోతిన రఘు, పోతన ఎల్లంనాయుడు, గరె గురునాథ్, గొలగాని సన్యాసిరావు, బోయి రమాదేవి, జనసేన ఆరో వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, ప్రముఖ పారి శ్రామికవేత్త టి. విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో ప్రచారం

పద్మనాభం : పద్మనాభం పంచాయతీలో గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా టీడీపీ నాయకులు మంగళవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ముందుగా కుంతీమాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇసకలపాలెం, పద్మనాభం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, దామోదరరావు, లీలావతి, గోపీబాబు, నందీశ్వరరావు, లక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు.

టీడీపీ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

- ఆ పార్టీలో చేరికలు వట్టి డ్రామా
- పాత వారికే మళ్లీ మళ్లీ కండువాలు
- వైసీపీ భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం, ఏప్రిల్ 23 : తెలుగుదేశం పార్టీకి చెందిన వారికే గంటా శ్రీనివాసరావు మళ్లీ మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరికలు జరిగినట్టు ఆనంద పడుతున్నారని భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొవ్వాడ సర్పంచ్ టీడీపీకి చెందిన వ్యక్తి అని, ఆయనకు కండువేసి వైసీపీ సర్పంచ్ పార్టీలో చేరినట్టు ఫేక్ ప్రచారం చేస్తున్నారని వ్యంగ్యంగా అన్నారు. ఆ సర్పంచ్‌కు వైసీపీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రతి రోజూ టీడీపీలో చేరారని కండువాలతో చూపుతున్న వాటిలో చాలావరకూ వారి పార్టీవారేనని చెప్పారు. ఫేక్ ప్రచారాలు చేసుకుంటూ, పేపర్లలో అసత్యపు ప్రచారాలు రాయించుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. గంటా ఎన్ని ఫేక్ ప్రచారాలు చేసుకున్నా..విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు ఎన్ని కూటమిలు కట్టినా ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి వున్నారని, ఆయన గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. జగన్ బస్సు యాత్ర విజయవంతంగా సాగిందన్నారు. నియోజకవర్గంలోని మధురవాడ, కొమ్మాది, ఆనందపురం ప్రాంతాల్లో వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి బస్సు యాత్రను విజయవంతం చేశారని ఆనందం వ్యక్తం చేశారు.

నేడు ముత్తంశెట్టి నామినేషన్

భీమిలి వైసీపీ అభ్యర్థిగా ముత్తంశెట్టి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, 50 వేల వరకూ స్వచ్ఛందంగా రాబోతున్నారన్నారు. పట్టణంలోని ఆర్‌టీసీ బస్‌స్టాండ్ నుంచి బీచ్‌రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభాస్థలికి ప్రజలు ర్యాలీగా వస్తారని, అక్కడ బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేస్తామని తెలిపారు. బహిరంగ సభకు పార్టీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, బాలరాజు, కోలా గురువులు, తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

నామినేషన్‌కు తరలిరండి : ఎంపీపీ

ముత్తంశెట్టి నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన అవంతి క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి రెట్టించిన ఉత్సాహంతో జనాలు స్వచ్ఛందంగా తరలిరానున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో అవంతి గెలుపునకు సంకేతంగా నామినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దాట్ల ప్రసాదరాజు మాట్లాడుతూ టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చి ఎంతో గౌరవాన్ని అందుకుని, పదవులు పొంది తిరిగి టీడీపీలో చేరిన వారు నైతిక విలువలుంటే ఆయా పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఈ సమావేశంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, నాయకులు శిరుగుడు ఈశ్వరరావు, కొల్లి కోటిరెడ్డి, సరగడ రఘు పాల్గొన్నారు.

వైసీపీలో పలువురి చేరిక

తగరపువలస, చిట్టివలస గ్రామాల వైసీపీ నాయకులు చిప్పాడ వెంకటేష్, చిల్ల భాస్కర్‌రెడ్డి, దుక్క వెంకట అప్పారావు ఆధ్వర్యంలో గొల్లవీధికి చెందిన పలువురు వైసీపీలో చేరారు. వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు ఆధ్వర్యంలో తాటితూరు, టి. నగరపాలెం, సంగివలస, చిట్టివలస ప్రాంతాల్లోని యువకులు కూడా పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎస్. కరుణాకర్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, ఎస్.సరళారాణి, దుర్రి రామయ్యమ్మ, తెడ్లాపు అప్పలరాజు, చిల్ల ప్రమీల, మద్ది లక్ష్మి, జీరు లక్ష్మి, విజయ పాల్గొన్నారు.



పెదవాల్తేరు, తదితర ప్రాంతాల్లో ప్రచారంలో పాల్గొన్న వెలగపూడి సుజన



కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతరలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వెలగపూడి



దుర్గా ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెలగపూడిని మరోసారి గెలిపించండి

వెలగపూడి సుజన

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 23 : అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి సుజన ఓటర్లను కోరారు. మంగళవారం ఆమె ఎంవీపీ కాలనీ పన్నెండో సెక్టరులోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు సార్లు గెలిపించి ఓటర్లు తమ అభిమానాన్ని చాటుకున్నారని, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కబ్జాలు లేని పాలన కోసం నాలుగోసారి కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా సుజన పర్యటించిన ప్రాంతాల్లో మహిళలు ఆమెకు బొట్టు పెట్టి, సాదరంగా ఆహ్వానించారు.కార్యక్రమంలో వెలగపూడి కుటుంబ సభ్యులు పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్ పాల్గొన్నారు.

పెదవాల్తేరు : వెలగపూడి రామకృష్ణబాబును నాలుగోసారి గెలిపించాలని వెలగపూడి సుజన కోరారు.ఆమె పార్టీ నాయకులతో కలిసి పెదవాల్తేరు, ఇందిరానగర్, ఉషోదయ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంచారు. ఈ కార్యక్రమంలో పద్మజ, సీతా మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి వెలగపూడి అభినందనలు

ఎంవీపీ కాలనీ/మద్దిలపాలెం, ఏప్రిల్ 23 : శివాజీపాలెంకు చెందిన బుచ్చ దుర్గా ప్రసాద్ పదో తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించడంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గా ప్రసాద్ పట్టుదలతో మంచి మార్కులు సాధించడం అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్ట రమణ, 22 వార్డు అధ్యక్షుడు అప్పారావు, రాజు, రమణ, రవి దువ్వి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు తూర్పు వైసీపీ అభ్యర్థి ఎంవీవీ నామినేషన్





మాట్లాడుతున్న ఎంవీవీ, పెదజాలారిపేటలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

పెదవాల్తేరు,ఏప్రిల్ 23 : తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ బుధవారం నామినేషన్ వేయనున్నారు. మంగళవారం ఆయన లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ వేసేందుకు ఉదయం 8 గంటలకు ఆరిలోవ లాస్ట్ బస్ స్టాప్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరుతామన్నారు. హనుమంతువాక జంక్షన్, విశాలక్షినగర్, అప్పుఘర్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి రోడ్డు, ఎంవీపీ డబుల్ రోడ్డు మీదుగా ఉషోదయ జంక్షన్, విశాఖ కంటి ఆస్పత్రి, పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయం మీదుగా సిరిపురం జంక్షన్, సెవెన్‌హిల్స్ ఆసుపత్రి, జగదాంబ జంక్షన్, కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొవాలని ఆయన కోరారు.

భక్తులకు ప్రసాదం వితరణ

పెదవాల్తేరు : కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర పురస్కరించుకుని ఎంవీవీ సత్యనారాయణ పెదజాలారిపేటలోని భక్తులకు మంగళవారం ప్రసాద వితరణ చేపట్టారు. అంతకముందు ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నగర ప్రజలను చల్లంగా చూడు తల్లి అని అమ్మవారిని వేడుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఏప్రిల్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐలు వి.రామన్, నరసింహన్ సోదరులు రూ.లక్ష, విశాఖ నగరానికి చెందిన సత్తెనపల్లి మురళీకృష్ణమూర్తి వెంకటపద్మ లక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఎన్ఆర్ఐ విరాళాన్ని చెక్ రూపంలో, మురళీకృష్ణ దంపతులు నగదు రూపంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తికి మంగళవారం అందజేశారు.దాతల కుటుంబాలకు ఆలయ ఆచారం ప్రకారం అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్న వార్షిక కల్యాణోత్సవాల్లో నేడు

సింహాచలం, ఏప్రిల్ 23 : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆరు గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తారు.ఉదయం 8 గంటల నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ), ముత్యాల పల్లకి సేవలు జరుపుతారు. మధ్యాహ్నం 11.30 నుంచి 2.30 వరకు మహాసంప్రోక్షణ, ప్రభాతారాధన, బాలభోగం, మంగళా శాసనం, మహా రాజభోగం నివేదనం, మధ్యాహ్న విరామం. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనాలు, 6 నుంచి దర్శనాలు నిలిపి వేసి రాత్రి ఆరాధన, పుష్ప యాగం, ద్వాదశారాధనలు, సప్తావరణం, దర్పణ సేవ, సంవాద సేవ, ఉంజల సేవ, పవళింపు, ఏకాంత సేవతో ఉత్సవాలు పూర్తికానున్నాయి.

26న రంగసాయి నాటక గ్రంథాలయం వార్షికోత్సవం

సిరిపురం, ఏప్రిల్ 23 : రంగసాయి నాటక గ్రంథాలయం 12వ వార్షికోత్సవం టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఉన్న రంగసాయి నాటక గ్రంథాలయంలో ఈనెల 26న నిర్వహించనున్నట్టు గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్‌సాయి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందిస్తామని చెప్పారు.

భీమిలిలో కూటమి నాయకుల ప్రచారం

భీమునిపట్నం, ఏప్రిల్ 23 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తమ అభ్యర్థులు గంటా శ్రీనివాసరావు, ఎం. శ్రీభరత్‌కు మద్దతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బోయవీధిలో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తారన్నారు. బోయవీధిలో మంచినీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మత్స్యకారులకు టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, నాగరాజు, కొక్కిరి అప్పన్న, పెంటపల్లి యోగేశ్వరరావు, బీజేపీ నాయకులు కంటుభుక్త సునీత, పాలుబోతు విజయ పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి ఆశ్రమం వార్షికోత్సవం

పద్మనాభం, ఏప్రిల్ 23 : మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న రామకోటి ఆశ్రమ అష్టమ వార్షికోత్సవం, దుర్గా కాశీ విశ్వేశ్వర ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పరమ శివునికి పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు, దుర్గామాతకు కుంకుమార్చనలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రామకోటి ఆశ్రమం వార్షికోత్సవ సభలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన స్వామీజీలు పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు.

పలు రైళ్లు రద్దు... దారి మళ్లింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 23: విజయవాడ డివిజన్ పరిధిలో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున పలు రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 29 నుంచి వచ్చే నెల 26 వరకు గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243), ఈనెల 30 నుంచి వచ్చే నెల 27 వరకు రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రద్దు కాగా, కాకినాడ-విశాఖ మధ్య నడిచే 17267/17268 నంబర్లు గల రైళ్లను ఈనెల 29 నుంచి వచ్చే నెల 26 వరకు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఇక, ఎర్నాకులం-పాట్నా (22643), బెంగళూరు-గువాహటి (125 09), ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), ధన్‌బాద్-అలెప్పీ బొ కారో ఎక్స్‌ప్రెస్ (13351), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిదిహ్-తంబరం (12376), హటియా-ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837), హటియా-బెంగళూరు (12835), టాటా-బెంగళూరు (12889) తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొన్ని ప్రత్యేక తేదీల్లో రానుపోను వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు పేర్కొన్నారు.

విశాఖ, చెన్నై, హటియా మధ్య ప్రత్యేక రైళ్లు

వేసవి ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ-చెన్నై ఎగ్మోర్, విశాఖ-హటియా మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు త్రిపాఠి తెలిపారు.

విశాఖ-చెన్నై ఎగ్మోర్-విశాఖ

08557 నంబరు గల రైలు ఈనెల 27 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-హటియా-విశాఖ

08555 నంబరు గల రైలు ఈనెల ఈనెల 28 నుంచి జూన్ 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.50 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 2.45 గంటలకు హటియా చేరుతుంది. తిరిగి ఈనెల 29 నుంచి జూలై ఒకటి వరకు ప్రతి సోమవారం సాయంత్రం 4.00 గంటలకు హటియాలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.50 గంటలకు విశాఖ చేరుతుంది.

చిట్టివలస హైస్కూల్లో సీబీఎస్‌ఈ సిలబస్

తగరపువలస, ఏప్రిల్ 23 : మండలంలోని చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయనున్నారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ సిలబస్ మాత్రమే అమల్లో ఉంది. మొదటిసారిగా ఈ పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ పాఠశాల 1972లో ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఉన్నత పాఠశాలగా ఏర్పాటైన తరువాత గత మూడేళ్లలో ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అలాగే ఎస్ఎంఎం ఎస్‌కు తొమ్మిది మంది ఎంపికయ్యారు. కొన్నేళ్లుగా పదో తరగతి ఫలితాల్లోనూ నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యా శాఖ అధికారులు ఈ పాఠశాలను సీబీఎస్‌ఈ సిలబస్‌కు ఎంపిక చేశారు.

కాంగ్రెస్ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జోసెఫ్


జోసెఫ్ కాకర్ల

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జోసెఫ్ కాకర్లను నియమిస్తూ ఏపీసీసీ మైనారిటీ విభాగం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర నాయకులకు జోసెఫ్ ధన్యవాదాలు తెలిపారు. క్రిస్టియన్, మైనారిటీ విభాగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఓషన్ సెయిలింగ్ రేస్ విజేత నీలికాంత్


ఐఎన్ఎస్‌వీ నీలికాంత్ సెయిలింగ్ వెజల్

విశాఖపట్నం, ఏప్రిల్ 23: ఇంటర్ కమాండ్ ఓషన్ సెయిలింగ్ రేస్ 2023లో ఐఎన్ఎస్‌వీ నీలికాంత్ విజేతగా నిలిచింది. ఈ వెజల్ మంగళవారం తూర్పు నావికాదళానికి చేరింది. వాటర్‌మెన్ షిప్ అండ్ అడ్వంచర్ సెలింగ్‌ను ప్రమోట్ చేసేందుకు వచ్చిన నీలికాంత్‌ను రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్‌రాజు సాదరంగా ఆహ్వానించారు.

ఇంటర్నెట్, కేబుల్ కనెక్షన్లు కట్

- నగరంలో సీఎం జగన్ ప్రచారం ఎఫెక్ట్
- నెట్ సంస్థలకు రూ.లక్షల్లో నష్టం


విద్యుత్, కేబుల్ తీగలు కత్తిరిస్తున్న

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం ఎప్పుడు వచ్చినా ప్రజలకు ఇబ్బందులే. ఈసారి ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' అంటూ ఆయన నగరంలో బస్సు యాత్ర చేయడంతో వేపగుంట నుంచి ఎండాడ వరకు ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. బస్సుపై నిల్చొని ప్రచారం చేస్తారంటూ ఆయన వెళ్లే మార్గంలో విద్యుత్ వైర్లు, ఇంటర్నెట్ కేబుళ్లు, టీవీ కేబుళ్లు కట్ చేసేశారు. ఇక చెట్ల గురించి చెప్పనక్కరలేదు. మోళ్లు మాత్రమే ఉంచి కొమ్మలన్నీ నరికేశారు. సీఎం భద్రత కోసం ఆ మాత్రం తప్పదని అనుకున్నా... విద్యుత్ సరఫరా నిలిపివేయడం, ఇంటర్నెట్ కేబుళ్లు కత్తిరించడాన్ని నగరవాసులు తట్టుకోలేకపోతున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఇవన్నీ కత్తిరించుకుంటూ పోయిన ఆయా శాఖల సిబ్బంది రెండు రోజులైనా పునరుద్ధరించకపోవడంతో తీవ్రంగా మండిపడ్డారు. విద్యుత్ సరఫరా ఇచ్చినా, ఇంటర్నెట్ కేబుళ్లు చాలాచోట్ల ఇంకా సరిచేయలేదు. దీంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కాగా బీఎస్ఎన్ఎల్, యూ బ్రాడ్‌బ్యాండ్, హాత్‌వే తదితర సంస్థల వినియోగదారులు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


శ్రీభరత్, గణబాబులను సత్కరించిన నాయీబ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

కులవృత్తుల వారికి అండగా టీడీపీ

విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్

గోపాలపట్నం/వేపగుంట, ఏప్రిల్ 23: కులవృత్తులు చేసేవారికి అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ అన్నారు. ఇక్కడి బాజీ జంక్షన్‌లో కూటమి అభ్యర్థులతో నాయీబ్రాహ్మణులు మంగళవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంబించిన విధానాలతో కులవృత్తులు చేసుకునే వారికి తీరని నష్టం వాటిల్లిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులవృత్తుల వారు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. వైసీపీ హయాంలో విశాఖ అభివృద్ధి జరగకపోగా డ్రగ్స్ హబ్‌గా మారిందని విమర్శించారు. కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని శ్రీభరత్ కోరారు. టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి పి.గణబాబు మాట్లాడుతూ కులవృత్తులు చేసే వారి కోసం టీడీపీ హయాంలో అమలు చేసిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులవృత్తుల వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉండి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పెబ్బిలి రవికుమార్, దేవగుప్త రమేశ్, ఎం.రమణ, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి అనసూయ మధు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నరవ పైడిరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయీబ్రాహ్మణ సంఘంప్రతినిధులు శ్రీభరత్, గణబాబులను ఘనంగా సత్కరించారు.

సింహాచలేశుడి బృందంపై దొంగల దాడి

- స్వామివారి ఉంగరం అపహరణ
- భక్తి తత్వాన్ని చాటిన మృగయోత్సవం

సింహాచలం, ఏప్రిల్ 23: వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన మృగయోత్సవం (దొంగలదోపు) వేడుక భక్తితత్వాన్ని చాటింది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి దేవేరులతో రాత్రి వేళ అడవికి వేటకు బయలుదేరి వెళ్లాడు. ఆ సమయంలో నీలుడు అనే చోరుడు స్వామివారి బృందాన్ని అటకాయించి స్వామి వేలికి ఉన్న ఉంగరాన్ని అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం మృగయోత్సవం (దొంగలదోపు) వైభవంగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో అలంకరించి అశ్వవాహనం మీద, మరో పల్లకిలో తిరుమంగై ఆళ్వార్ (నీలుడు)ను, అమ్మవార్లను ఇంకొక పల్లకిలో ఉంచి సింహగిరి ప్రధాన మాడవీధుల మార్గంలోకి తీసుకువచ్చారు. మార్గమధ్యలో నీలుడు (చోరుడు)గా ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు నటించి హడావిడి చేసిన తీరు భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నీలుడు విగ్రహానికి స్వామి శరసంధానం చేసినట్టు భావించి విగ్రహం మెడను ఒరిగినట్టు చేయడం ఉత్సవంలో విశేషం. ఉత్సవంలో అర్చక స్వాములతో పాటు గిరిజన యువత పాల్గొన్నారు. అనంతరం అంతరాలయంలో స్వామివారికి పవళింపు సేవ మంగళాశాసనములు జరిపి కావాట బంధనంతో ఆరో రోజు కార్యక్రమాలు ముగిశాయి. ఉత్సవాన్ని స్థానాచార్యులు రాజగోపాల్ నడిపించగా, ఏర్పాట్లను ఏఈఓ, పర్యవేక్షణాధికారులు చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు వినోదోత్సవం పేరుతో ఉంగారాన్ని వెతుక్కునే వేడుక నిర్వహించనున్నారు.



రాజాలంకరణలో గోవిందరాజస్వామి, నీలుడుగా (దొంగ) సీతారామాచార్యుల బృందం


చూర్ణోత్సవం సందర్భంగా స్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

సందడిగా చూర్ణోత్సవం

సింహాచలం: కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచి వివిధ రకాల చూర్ణాలను పట్టుకుని బేడా మండపంలో ప్రదక్షిణం చేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో రంగులను నీటిలో కలిపి అర్చకులు, సిబ్బంది చల్లుకుని, భక్తులపై చల్లారు. స్వామివారిని, అమ్మవారిని ఒక పల్లకిలో, ఆళ్వార్లను, చక్రపెరుమాళ్ (సుదర్శనుడు)ను వేరే పల్లకిలో ఉచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు.పవిత్ర గంగధారకు తీసుకువెళ్లి వేదికపై దేవతామూర్తులను ఉంచి షోడశోపచారాలు సమర్పించి, పూజలు చేశారు. అనంతరం చక్రపెరుమాళ్‌ను గంగధార ప్రవాహం కింద ఉంచి చక్రస్నానం జరిపించారు. ఉత్సవ ఏర్పాట్లను ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం అందజేశారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం


సంప్రదాయ తలపాగాలతో ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, విష్ణుకుమార్ రాజు తదితరులు

ఎన్నికల సిత్రాలు

విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌తో కలిసి సంప్రదాయ వస్త్రధారణ, తలపాగాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తలపాగాలను ధరించి సందడి చేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

జగన్‌కు ఓటు అడిగే నైతికత లేదు

- ఉత్తరంలో లక్ష్మీనారాయణ పోటీ ఆశ్చర్యకరమే
- కేకే రాజు రౌడీరాజ్యం నడుపుతున్నారు
- బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే, ఉత్తర నియోజకవర్గం కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. సీతమ్మధార పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యనిషేధం విధిస్తానని ప్రకటించిన జగన్ రూ.12 విలువైన మద్యాన్ని రూ.250కి అమ్ముతూ ఐదేళ్లలో రూ.3.5లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఏడాదికి రూ.30 వేల కోట్ల లిక్కర్ కుంభకోణం జరిగిందన్నారు. ఆరుసార్లు విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే రాజు రౌడీరాజ్యం నడుపుతున్నారని విమర్శించారు. గంజాయి మూకల్ని చేరదీసి, రౌడీలను తయారు చేసి ప్రతిపక్షాలపైకి ఉసిగొల్పుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ విశాఖపట్నం వచ్చినపుడు విమానాశ్రయంలో వారిపై దాడులు చేసింది కేకే రాజు మనుషులేనని, వారిలో ఆయన కూడా ఉన్నారని ఆరోపించారు. కేకే రాజుపై తాను ఈ ఎన్నికల్లో 50వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానన్నారు. సీబీఐ అధికారిగా జగన్ అవినీతి కేసులను దర్యాప్తు చేసిన వీవీ లక్ష్మీనారాయణ ఉత్తర నియోజకవర్గంలో పోటీ చేయడంపై విశాఖ వాసులు అనేక రకాలుగా మాట్లాడుకుంటున్నారన్నారు. తనను అసెంబ్లీకి పంపకుండా అడ్డుకోవడం కోసం అతనిని వైసీపీయే పోటీకి దించిందనే ప్రచారం కూడా జరుగుతోందన్నారు. తన విజయం కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు నూరు శాతం సహకరిస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

వైభవంగా పోలమాంబ అమ్మవారి జాతర


విద్యుత్ కాంతుల్లో పోలమాంబ అమ్మవారి ఆలయం


పోలమాంబ అమ్మవారు


అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచివున్న భక్తులు

- భక్తుల రద్దీ
- విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న దేవాలయం

పెదవాల్తేరు, ఏప్రిల్ 23 : పెదవాల్తేరులో శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ప్రధాన పండుగ మంగళవారం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచి భక్తుల తాకిడి మొదలైంది. సుమారు లక్షా యాభై వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. పెదవాల్తేరులోని మద్దివారి పెద్దంట నుంచి ఆలయం వరకు ఘటాలు, నేల వేషాలు, పులి వేషాలు, గరిడీలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు ఆలయం వద్ద తాగునీరు, పాలు, మజ్జిగ అందజేశారు. ఉత్సవం ఏర్పాట్లను ఆలయ ఈఓ గాయత్రి పర్యవేక్షించారు.

జిల్లాలో శతశాతం ఓటింగ్ లక్ష్యం

- ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఆలిండియా రేడియో ద్వారా ఓటర్లకు పిలుపునిచ్చిన కలెక్టర్



రేడియోలో మాట్లాడుతున్న కలెక్టర్

విశాఖపట్నం, ఏప్రిల్ 23: పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించడం ప్రథమ కర్తవ్యమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున ఓటర్లకు పిలుపునిచ్చారు. వచ్చేనెల 13న జరిగే ఎన్నికల పండగలో ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు ప్రాముఖ్యత, ఆవశ్యకతను తెలుసుకోవాలని నూరు శాతం ఓటింగ్ లక్ష్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటరు చైతన్యం, ఓటు ప్రాముఖ్యత, వినియోగం, హోం ఓటింగ్ విధానం, పోలింగ్ స్టేషన్లవద్ద వసతులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ తదితర అంశాలపై మంగళవారం ఆలిండియా రేడియోద్వారా కలెక్టర్ ఓటర్లకు సందేశమిచ్చారు. స్థానిక ఆలిండియా రేడియోస్టేషన్‌లో నిర్వహించిన టాక్‌షోలో ఆయన పాల్గొని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై మాట్లాడారు.

యువత ఉత్సాహంగా ఓటువేయాలి

జిల్లాలో తొలిసారి ఓటు హక్కు పొందిన యువత 60 వేల మంది ఉన్నారని, వారంతా ఓటు వినియోగంలో ఉత్సాహం చూపాలన్నారు. యువశక్తే నిర్ణయాత్మకమని, తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లాలోని 1,991 పోలింగ్ కేంద్రాలవద్ద షామియానాలు, తాగునీరు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో సాధారణ పౌరుల అవసరాలు గుర్తించి చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అప్రమత్తంగా ఉంటున్నామని, ఇప్పటికే 58 సంఘటనలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 68 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని, కోడ్ అమలుకు 110 రకాల బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వస్తు ధన రూపంలో రూ. 5.03 కోట్లను జప్తు చేశామని పేర్కొన్నారు. ఓటర్లను చైతన్య పరిచేందుకు అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తామని, మేధావులతో చర్చలు నిర్వహిస్తామన్నారు.

ఎపిక్ కార్డు లేకపోయినా ఓటువేయవచ్చు

ఓటరు జాబితాలో పేరుండి, అర్హులైనవారు ఎపిక్ కార్డు లేకపోయినా ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని కలెక్టర్ వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల కార్డులు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఇతర ఆధారాలు) చూపించి ఓటు వేయవచ్చునన్నారు. ప్రతి ఓటరుకు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందజేస్తామని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. టాక్ షోలో డీఐపీఆర్వో ఎస్‌వీ రమణ, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఆలిండియా రేడియో ప్రొగ్రాం హెడ్ పీవీ రామ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు పెట్రోల్ కూపన్లు ఇవ్వొద్దు

- రాజకీయ పార్టీల నేతలకు జేసీ సూచన

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రాజకీయపార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పెట్రోల్ కూపన్లు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందని విశాఖ తూర్పు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఇటువంటి ప్రలోభాలకు గురిచేయడం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పరిధిలోనికి వస్తుందన్నారు. రాజకీయపార్టీలు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. పెట్రోల్ బంకుల యజమానులు కూడా పార్టీలు జారీచేసిన కూపన్లపై పెట్రోల్, డీజల్ పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడి మృతి

మల్కాపురం, ఏప్రిల్ 23: షిప్‌యార్డులో ఓ కాంట్రాక్టు కార్మికుడు అకస్మాత్తుగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద మహంతి నరేశ్‌కుమార్ (53) కుమార్తె ప్రియాంక కుమారితో కలిసి ఉంటున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే నరేశ్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రియాంక కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


పట్టుబడిన నిందితులతో రైల్వే పోలీసులు

విశాఖపట్నం, ఏప్రిల్ 23: తెలంగాణలో హత్య చేసి విశాఖ మీదుగా పరారయ్యేందుకు ప్రయత్నించిన కుర్బాన్ ఆలీ మొల్లా (20), జువెనైల్ అనే నిందితులను విశాఖ రైల్వే పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. తెలంగాణలోని జగదేవ్‌పూర్ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ హత్య కేసుకు సంబంధించి సమాచారం అందుకున్న విశాఖ రైల్వే పోలీసులు రైళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046) జనరల్ కోచ్‌లో బెర్తుల దాక్కుని ఉన్న నిందితులను గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తెలంగాణ జగదేవ్‌పూర్ స్టేషన్ సమాచారమిచ్చి అప్పగించారు. నిందితుల అప్పగింతలో చొరవ చూపిన విశాఖ జీఆర్పీ సిబ్బందిని సిద్దిపేట కమిషనరేట్ కమిషనర్ అభినందించారు.

నెట్టర బాబూ... నెట్టు!

- ఈ-ఆటో ఎక్కాలంటే... ముందుకు నెట్టాల్సిందే
- మూన్నాళ్ల ముచ్చటగా బీచ్‌రోడ్డులో ఈ-ఆటోలు
- వృద్ధులు, వికలాంగులు, బాలింతలకు అందని ఉచిత రవాణా సేవలు


బీచ్‌రోడ్డులో ఈ-ఆటో స్టార్ట్ కాకపోవడంతో ముందుకు నెడుతున్న దృశ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో బాలింతలు, వృద్ధులు, వికలాంగులకు ఉచిత రవాణా కోసం ఏర్పాటు చేసిన ఈ-ఆటోలు మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆటోల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇంజన్ స్టార్ట్ కాకపోవడంతో ఆటోల డ్రైవర్లు సందర్శకులను పిలిచి ఆటోలను ముందుకు నెట్టించి స్టార్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీచ్‌ను సందర్శించేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, బాలింతలను ఆర్కేబీచ్ నుంచి సాగర్‌నగర్ వరకూ ఉచితంగా తీసుకెళ్లి, తీసుకొచ్చేందుకు వీలుగా జీవీఎంసీ అధికారులు 'ఏకో వైజాగ్' పేరుతో గత ఏడాది జూలై పదిన పది ఈ-ఆటోలను ప్రారంభించారు. ఇవన్నీ బీచ్‌రోడ్డులో ఉచితంగా సేవలందిస్తాయని ప్రకటించారు. తర్వాత అధికారులు వీటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. దీనివల్ల సెల్ఫ్‌మోటార్లు పనిచేయకపోవడంతో స్టార్ట్ చేయాలంటే ఆటోని ముందుకి నెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా కొంతమంది ఆటోడ్రైవర్లు ఉచితసర్వీస్‌కి బదులుగా ఆటో ఎక్కేందుకు వచ్చే ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఏదో మేలు చేస్తున్నామంటూ ప్రగల్భాలు పలికిన వైసీపీ నేతలు, జీవీఎంసీ అధికారులు మూన్నాళ్లకే వాటిని మరిచిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.